RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: మల్లె నాగిరెడ్డి




## నేరస్థులను కఠినంగా శిక్షించాల్సిందే

శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు

వార్త తెలియగానే భక్తుడిగా తల్లడిల్లి పోయా

సిఎం చంద్రబాబును కోరిన నటుడు మోహన్ బాబు

2లో



2లో

## తిరుపతి ప్రసాదంపై ఇంత నిర్లక్ష్యమా


నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 3. సంచిక :05 | ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in





# హైదరాబాద్‌లో కుండపోత వర్షం..

**హైదరాబాద్,మనసాక్షి:** భాగ్యనగరంలో భారీ వర్షం పడుతోంది. నగరంలో కుండపోతగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం ధాటికి లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడుతోంది. వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయారు.

కోఠి, బషీర్‌బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, నారాయణగూడ, ముషీరాబాద్, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, ఉప్పల్, ఎల్‌బీ నగర్, కంటోన్మెంట్, నాగోల్, తార్నాక, నాంపల్లి, లక్డీ కపూల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ÷నాన్షియల్ డిస్ట్రిక్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఇక ఆఫీస్‌ల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.నగర వ్యాప్తంగా మరో గంట పాటు భారీ వర్షం కురుస్తుందని వాతావరణ వాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు జీహెచ్‌ఎంసీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఎవరు బయటికి రావద్దంటూ జీహెచ్‌ఎంసీ హెచ్చరించింది.

**హైదరాబాద్‌లో భారీ వర్షం జలమయం అయిన లోతట్టు ప్రాంతాలు**

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జీహెచ్‌ఎంసీ కమిషనర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైన పని ఉంటేనే బయటకు రావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నగరవాసులను కోరారు. బలమైన గాలులు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నందున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.



# జమిలి ముసుగులో దేశాన్ని కబళించే కుట్ర

### ఏచూరి ఉండివుంటే ఇలంటి వాటిపై పోరాడేవారు

### ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది

### సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మనసాక్షి:** జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబలించాలని బీజేపీ చూస్తోందని.. ఇలాంటి సమయంలో సీతారం ఏచూరి లేకపోవడం దేశానికే తీరని లోటు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రాల మధ్య ఐక్యత దెబ్బతీసే కుట్ర జమిలి ఎన్నికల రూపంలో ఇప్పుడు జరుగుతుందని ఆయన చెప్పుకొచ్చారు. యూనియన్ ఆఫ్ స్టేట్స్ స్పిరిట్ ను దెబ్బతీసేందుకే బీజేపీ ఈ ఎన్నికల కుట్ర చేస్తోందన్నారు. జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి ప్రజాస్వామిక వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయడానికి సీతారాం లేకపోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. రవీంద్రభారతిలో శనివారం జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభకు రేవంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. చనిపోయాక కూడా ప్రజలకు ఉపయోగపడ్డ గొప్ప నేత సీతారం ఏచూరి అని కొనియాడారు.

కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో అడుగుపెట్టిన సీతారాం ఏచూరి దాదాపు నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా, సామాజిక

మిగతా 2లో

## మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్

### ఐటిఐల్లో సిలబస్ మార్పులు చేయాలి

### అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన

**హైదరాబాద్,మనసాక్షి:** మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐ ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తలు సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. సచివాలయంలో కార్మిక, ఉపాధి క ల్పన శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని, శిక్షణ తీసుకుంటున్న వారికి సమగ్రమైన శిక్షణ అందేలా జాగ్రత్తపడాలని సూచించారు. ఐటీఐ కళాశాలల పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఐటీఐ, ఏటీసీలేని అసెంబ్లీ సెగ్మెంట్లను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ, ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



## అమృత్ టెండర్లపై కెటిఆర్ దుష్ప్రచారం

**నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా**

**లేకుంటే కెటిఆర్ రాజీనామా చేస్తారా**

**కెటిఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తా**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు కేటీఆర్ నిరూపిస్తే నేను రాజీనామాకు సిద్ధం. నిరూపించలేకపోతే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. టెండర్లను గత ప్రభుత్వమే రూ.3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలుగా పిలిచిందని వివరించారు. పోలింగ్ తేదీకి ఒక్కరోజు ముందే గత ప్రభుత్వం ఈ టెండర్లను కట్టబెట్టిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం

కేవలం రూ.3,516 కోట్ల పనులకే టెండర్లు పిలిచింది. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పేరు మీద రూ.39వేల కోట్ల ప్రజాధనం లూటీ చేశారు. విమర్శనాత్మకంగా ఉండే విమర్శలు చేయాలని కేటీఆర్‌కు సూచిస్తున్నట్లు వెల్లడించారు. ఆధారాలతో కూడిన విమర్శలు చేయాలి. ఖమ్మంలో నాపై పోటీ చేసిన ఉపేందర్‌రెడ్డి అల్లుడు సృజన్‌రెడ్డి ఒకటి దక్కించుకున్నారు. టెండర్లు వేయొద్దని ఏ కంపెనీని కూడా ప్రభుత్వంలోని పెద్దలు బెదిరించలేదు. మేం పిలిచిన రీ టెండర్లలో గతంకంటే రూ.54 కోట్లు తక్కువకే బిడ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి వివరించారు.కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తామన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమృత్ పథకంలో రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు కేటీఆర్ నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఒక వేళ కేటీఆర్ తన ఆరోపణలను నిరూపించకపోతే రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. తన సవాల్ ను కేటీఆర్ స్వీకరిస్తే సెప్టెంబర్ 22న ఉదయం ఎక్కడికైనా వస్తానన్నారు. స్పీకర్ ఫార్మాట్లో ఇద్దరం రాజీనామా చేద్దాం అంటూ కేటీఆర్ కు సవాల్ విసిరారు పొంగులేటి. టెండర్లను గత సర్కారే 3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలు పిలిచిందన్నారు పోలింగ్ తేదీకి ఒక్కరోజు ముందే టెండర్లను కట్టబెట్టిందన్నారు.




## 'సీఎం రేవంత్ ప్రమేయంతోనే ఆ టెండర్లు.. అక్రమాల నిగ్గు తేల్చాలి'

**8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం**

**సొంత బావమరిది కంపెనీకి టెండర్లు కట్టబెట్టిన సిఎం**

**బిజెపి ప్రభుత్వం విచారణ జరపాలని కెటిఆర్ డిమాండ్**

సీఎం బావమరిది కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకున్నా దొడ్డిదారిన రూ.1,137 కోట్ల పనులు దక్కించుకున్నారన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య

**కామారెడ్డి,మనసాక్షి:** ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలో చోటుచేసుకుంది. కోనాపుర్‌లో సాయి కుమార్ (24), వీణ (22) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివాహానికి పెద్దలు అంగీకరించ కపోవడంతో వీరు బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతదేహాలను కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించి.. విచారణ చేపట్టారు.





2లో

## పీఏసీ సమావేశంలో గందరగోళం..

అరికెపూడి నేతృత్వంలో తొలిసారి పిఎసి భేటీ

సమావేశాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్

చైర్మన్ నియామకమే తప్పన్న ప్రశాంత్‌రెడ్డి



## 28న ఒకరోజు పర్యటనకు హైదరాబాద్‌కు రాష్ట్రపతి


నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న ముర్ము

రాష్ట్రపతి రాకతో ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష

2లో

## తిరుపతి ప్రసాదంపై ఇంత నిర్లక్ష్యమా

### లడ్డూ కల్తీపై ఆగ్రహించిన పీఠాధిపతులు



**విజయవాడ:** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపవిత్ర పదార్థాలు వాడారని తెలిసి ఎంతో వేదన చెందినట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పెద్దపులిపాకలో హిందూ దేవాలయాల పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు మాట్లాడారు. ప్రసాదంలో ఏం కలుస్తుందోనన్న భయంతో భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అపవిత్ర పదార్థాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలి. స్వామి సన్నిధిలో వేరే మతస్థులకు ఉద్యోగం ఉండకూడదు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలు ఉన్నవారికే ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వం, ప్రజలు కలిసి ధర్మాన్ని రక్షించాలి. ల్యాబ్ నివేదికలు మనకు ఆధారం.. అవి స్పష్టం చేసినప్పుడు చర్యలు తీసుకోవాల్సిందే. ఇంకా తప్పు జరగలేదంటే అపహాస్యమే అవుతుంది. ల్యాబ్‌లు ఇచ్చిన నివేదిక ప్రకారం కోర్టుకు వెళ్లాల్సిందే. కోర్టు విధించిన శిక్షలు అమలు చేస్తేనే ఇలాంటివి మరోసారి జరగకుండా ఉంటుందని స్పష్టం చేశారు.

## నేరస్థులను కఠినంగా శిక్షించాల్సిందే

**హైదరాబాద్:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుని కలుపుతున్నారని వార్తలు తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయానని సీనియర్ నటుడు మోహన్‌బాబు అన్నారు. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపమని, ఇదేగాని నిజమైతే నేరస్థులను శిక్షించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రపంచ వ్యాప్తంగా ప్రతి హిందువు పూజించే కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి. ఆ దైవానికి నిత్యం సమర్పించే లడ్డూలలో కలిపే ఆవు నెయ్యిలో దాదాపు 3 నెలల క్రితం వరకు ఇతర జంతువుల కొవ్వుని కలుపు తున్నారని తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయాను. తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. నిత్యం 'మోహన్‌బాబు విశ్వవిద్యాలయం' నుంచి కనిపించే తిరుమల క్షేత్రాన్ని చూసి నాతో పాటు వేల మంది ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, భక్తిపూర్వకంగా నమస్కరించుకుంటూ ఉంటాం. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపం, ఘోరాతి ఘోరం, నికృష్టం, అతినీచం, హేయం, అరాచకం. ఇదే నిజమైతే నేరస్థులను శిక్షించాలని నా ఆత్మీయుడు, నా మిత్రుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హృదయపూర్వకంగా కోరుకుంటూ... ఈ కలియుగ దైవం శ్రీనివాసుని ఆశీస్సులు నా మిత్రుడు అందుకుని నూరేళ్ళు చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను'ఇక మోహన్‌బాబు సినిమాల విషయానికొస్తే, తనయుడు మంచు విష్ణుతో కలిసి 'కన్నప్ప'లో నటిస్తున్నారు.

## 28న ఒకరోజు పర్యటనకు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

**హైదరాబాద్:** ఈ నెల 28వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు రానున్నారు. నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులతో సమావేశమై సమీక్షించారు. ముర్ము తన ఒకరోజు పర్యటన సందర్భంగా నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలియజేశారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారు. శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను కోరారు. అదేవిధంగా, విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. అదేవిధంగా, రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జిహెచ్ఎంసి అధికారులతో సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖను ఆదేశించారు.డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజ్గ్÷ర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సీఎండీ టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసానికి తూట్లు

### తిరుమల లడ్డూ కల్తీపై కిషన్ రెడ్డి



హైదరాబాద్: కలియుగ ప్రత్యక్ష దైవం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కొంగు బంగారం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. ఈమేరకు కిషన్ రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏటా కోట్లాది మంది దర్శించుకునే తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం అనేది ప్రజల విశ్వాసానికి తూట్లు పొడవడమేనని అన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. ఇది క్షమార్హం ఎంత మాత్రం కాదని చెప్పారు. కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసిన నేరస్థులకు తగిన శిక్ష పడాలని హెచ్చరించారు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశవిదేశాల నుంచి నిత్యం లక్షలాది భక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. పరమ పవిత్రమైన, ఎంతో ప్రశస్తమైన లడ్డూ ప్రసాదాన్ని సేవిస్తారని అన్నారు. అప్పుడే తమ దైవ దర్శనం పూర్తయిందని భక్తులు భావిస్తారని అన్నారు. ఇంత పవిత్రంగా భావించే ఈ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులను, చేపనూనెలను వినియోగించడం క్షమించరాని నేరమని అన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి, తగిన శిక్ష పడేలా చేయాలని అన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు తిరుపతిలో అన్య మత ప్రచారం, తిరుమల కొండపైకి మద్యం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, టీటీడీలో అవినీతి అక్రమాలు గత కొన్నేళ్లుగా పతాక శీర్షికలవుతున్నాయని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర గతంలో జరిగిన నేపథ్యంలో వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి, బాధ్యులను శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడే, భక్తుల మనోభావాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశాన్ని సంచలనాత్మకంగా మార్చవద్దని రాజకీయ పార్టీలకు, ధార్మిక సంస్థలకు విజ్ఞప్తి చేశారు. పదేపదే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలు భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో బాధ్యతతో వ్యవహరించి సంయమనం పాటించాలని అన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే లక్షలాది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

# పీఏసీ సమావేశంలో గందరగోళం..



**హైదరాబాద్:** తొలిసారి ఏర్పడ్డ పిఏసి భేటీని విపక్ష బిఆర్ఎస్ బహిష్కరించింది. తెలంగాణ అసెంబ్లీ కమిటీ హాల్‌లో పీఏసీ సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ అరెకపూడి గాంధీ అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పీఏసీ సభ్యులు హాజరయ్యారు. పీఏసీ సమావేశాన్ని భారాస సభ్యులు బహిష్కరించారు. ఛైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించడంపై శ్రీధర్‌బాబును నిలదీశారు. పీఏసీ ఎంపిక తీరును నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించామని భారాస నేత ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎంపిక అప్రజాస్వామికంగా జరిగిందన్నారు. ఇటీవల పీఏసీ ఛైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించ డాన్ని భారాస నేతలు విమర్శించారు. ఈక్రమంలో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, గాంధీ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకున్నారు. అరికెపూడి నియామకం తరవాత శనివారం తొలిసారిగా పీఏసీ సమావేశమైంది. అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులతోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కాసేపటికే బీఆర్ఎస్ నేతలు మంత్రులతో వాగ్వాదానికి దిగారు. అర్హత లేని గాంధీకి పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యకు నిరసనగా తాము సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 11 గంటల తర్వాత సమావేశమైన ప్రజాపద్దుల కమిటీ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబుతోపాటు సభ్యులైన ప్రశాంత్ రెడ్డి, రావూరి ప్రకాశ్ రెడ్డి, వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గంగుల కమలాకర్, రామ్‌రావు పవార్, అహ్మద్ బిన్న అబ్దుల్లా బలాల,కూనంనేని సాంబశివరావు సహా ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, బానుప్రసాద్‌రావు, జీవన్ రెడ్డి, ఎల్ రమణ హాజరయ్యారు. అసెంబ్లీ కమిటీలో హాల్‌లో జరిగిన సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి వివాదం మొదలైంది. అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్మ్‌గా నియమించడంపై బీఆర్ఎస్ సభ్యులు నిలదీశారు. ఎంపిక తీరు సరిగా లేదని వాగ్వాదానికి దిగారు. ఈ నియామకంలో కక్షపూరితంగా వ్యవహరించారని అందుకే ఈ భేటీని బహిష్కరిస్తున్నట్టు ప్రశాంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఎవర్నీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణం తీసుకున్నట్టు వెల్లడించారు. ÷ూష్ట్రంలో ప్రభుత్వ పనితీరును, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా కొన్ని కమిటీలు ఉంటాయి. వాటిలో ఒకటే ఈ ప్రజాపద్దుల కమిటీ. ఇందులో 9 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఛైర్మన్ పదవి మాత్రం ప్రతిపక్షంలో ఉన్న ప్రధాన పార్టీకి లభిస్తుంది. సభ్యుల సంఖ్య కూడా ఆయా పార్టీల సంఖ్యాబలం బట్టి కేటాయిస్తారు. ఇక్కడే వివాదం నెలకొంది. అధికారంగా కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తికి పీఏసీ ఛైర్మన్ ఇవ్వడంపై బీఆర్సీ మండిపడింది. ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర పదజాలంతో పార్టీ మారిన వ్యక్తులను టా÷-గ్గ÷ట్ చేశారు. దీంతో రెండు రోజుల పాటు మెదక్ అంతా అల్లాడిపోయింది.

# జమిలి ముసుగులో దేశాన్ని కబళించే కుట్ర



సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ శనివారం రవీంద్రభారతిలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీతారాం ఏచూరికి నివాళి అర్పించారు.

కార్యకర్తగా ఏచూరి సేవలు మరువలేనివని, దేశంలో అందరికీ సుపరిచితులయ్యారని చెప్పారు. సీతారాం ఏచూరి లోటు పూడ్చలేనిదని సిఎం అన్నారు. దేశంలో ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు అని గుర్తుచేశారు. రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ తీసుకురావడంలో ఆయన కృషి గొప్పదని వివరించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో కమ్యూనిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. ఉపాధి హామి, ఆహార భద్రత పథకాలు కమ్యూనిస్టుల ఆలోచనలతోనే వచ్చాయన్నారు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని ఈ రోజుల్లో సీతారాం ఏచూరి ఒకే పార్టీలో ఉన్నారని... ఉన్నత కుటుంబంలో పుట్టి.. అణగారిన వర్గాల వారి కోసం సీతారాం ఏచూరి పోరాడారని అన్నారు. సీతారాం ఏచూరి జీవితం యువనాయకులకు ఆదర్శమని అన్నారు. ఈ సభలో ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తాను,సీతారాం జేఎన్ యూలో చదువుకున్నామని ..అక్కడే వారితో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఇందిరాగాంధీ యూనివర్శిటీకి వీసీ గా ఉన్నారని.. ఆమె రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చామన్నారు. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి.. ఎత్తివేసిన తరువాత కాలేజీలో చేరామన్నారు. ఏచూరికి హైదరాబాద్ లోనే వామపక్ష భావాలు ఉండేవని.. ఆయన మూడుసార్లు జేఎన్‌యూ అధ్యక్షులుగా పనిచశారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. క్యాంపస్ లో విద్యార్థుల అణచివేత ఉండొద్దని పోరాటం చేశారు సెక్యూలర్ ప్రజాస్వామిక విలువలు కాపాడటానికి అన్ని పార్టీలను ఏకం చేయడానికి ఏచూరి ఎంతో కృషి చేశారని తెలిపారు. తేడాలు పక్కనపెట్టి దేశాన్ని కాపాడుకోవడమే ఏచూరికిచ్చే నివాళి అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో ఉన్నాయని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నాలుగు విషయాలు ఏచూరి మన ముందు నిర్దేశిరచిన లక్ష్యాలు అని చెప్పారు. తేడాలను పక్కనపెట్టి దేశాన్ని కాపాడుకోవడమే మన ఏచూరికి ఇచ్చే నివాళులు అని అన్నారు.

# 8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం




**హైదరాబాద్**: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు. రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ.1000 కోట్ల విలువైన పనులు చేస్తుందా? అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదు. టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలి. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలి. ఈ టెండర్ల అవినీతిపై కేంద్రానికి లేఖ రాశాం. ప్రభుత్వం చేసిన అక్రమాలన్నీ బయటపెడతాం అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి అవినీతి కుటుంబ కథాచిత్రం నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన 8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం గురించి సాక్ష్యాలతో సహా బయటపెట్టారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే.. ఫిబ్రవరి మొదటి వారంలో 8,888 కోట్ల రూపాయల భారీ అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని కేటీఆర్ విమర్శించారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా రేవంత్ రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారని అన్నారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్ రెడ్డి పదవీ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్ రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని కేటీఆర్ అన్నారు. ఇందులో టెండర్ దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీతో రేవంత్ రెడ్డి బావమరిది జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకు తెరలేపారని తెలిపారు. 1,137 కోట్ల రూపాయల కాంట్రాక్టు గెలుచుకున్న తర్వాత ఆ కంపెనీ 20 శాతం పని చేస్తుందని, రేవంత్ రెడ్డి బావమరిది 80 శాతం వెయ్యి కోట్ల పని చేస్తుందని అంటున్నారని పేర్కొన్నారు. ఐహెచ్‌పీ అనే కంపెనీ ఈ మేరకు సెబీకి సమాచారం ఇచ్చిందని అన్నారు. ఈ కంపెనీని శిఖండి సంస్థగా అడ్డుపెట్టుకొని అనుముల రేవంత్ రెడ్డి, సూదిని సృజన్ రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ కాంట్రాక్టులు కట్టబెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా ఈ భారీ అవినీతికి తెరలేపారని కేటీఆర్ అన్నారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 7, 11, 13 నిబంధనల మేరకు రేవంత్ రెడ్డి విచారణను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పదవి కోల్పోతారని అన్నారు. తన కుటుంబ సభ్యులకు లబ్ది చేకూరిస్తే, ఆశ్రితపక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులేనని స్పష్టం చేశారు. ఇవే చట్టాల కింద సోనియా గాంధీ తన పదవిని కోల్పోయిందని గుర్తుచేశారు. 2006లో సోనియా గాంధీ నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా పదవిలో ఉన్నందుకు ఈ చట్టం ప్రకారం తన పదవిని కోల్పోయిందని తెలిపారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా అక్రమ మైనింగ్ అనుమతులు తన కుటుంబ సభ్యులకు ఇచ్చినందుకు తన పదవి కోల్పోయారని గుర్తుచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి 2011లో అశోక్ చవన్ ఆదర్శ కుంభకోణంలో తన పదవి కోల్పోయారని అన్నారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వాల్సిన గత్యంతరం వలన ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి దక్కిన వందల కోట్ల రూపాయల టెండర్ బయటకు వచ్చిందని తెలిపారు. వీటికి సంబంధించిన ఒక్క జీవో కూడా ప్రభుత్వం వెబ్‌సైట్‌లో పెట్టడం లేదని అన్నారు. టెండర్ల తాలూకు పూర్తి సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి చేస్తున్న అనేక కుంభకోణాలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు వరుసగా ఉంచుతామని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్ బ్రదర్స్ సిటీ వంటి కుంభకోణాలను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. బావమరిదికి అమృతం పంచుతూ తెలంగాణ ప్రజలకు విషాన్ని పంచుతున్న రేవంత్ రెడ్డిని ప్రజల ముందు ఎండగడతామని స్పష్టం చేశారు. అమృత్ పథకం అనేది కేంద్ర ప్రభుత్వ పథకమని.. అందుకే ఈ టెండర్లలో జరిగిన అభివృద్ధి అక్రమాలపై నిన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులకు లేఖ రాశామని తెలిపారు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాలను తేల్చాలని కోరామని అన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉన్న కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో జరిగిన అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో బీజేపీ కుమ్మక్కు కాకపోతే పూర్తిస్థాయి ఎంక్వైరీకి కేంద్రం ఆదేశించాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్రం పరిధిలోని ఈ పథకంలో జరుగుతున్న అవినీతిపై వెంటనే విచారణకు ఆదేశించాలన్నారు. లేదంటే రేవంత్ రెడ్డికి, కేంద్రంలోని బీజేపీ నేతలకు అవినీతితో సంబంధం ఉందని అనుకోవాల్సి వస్తుందని చెప్పారు.

# శ్రీవారి లడ్డు కల్తీపై సమగ్ర విచారణ జరిపించాలి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీతో పాటు జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కి భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైయున్న తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారికి ప్రీతిపాత్రమైన లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వుతో పాటుగా కల్తీ నెయ్యిని చేపనులను వినియోగించారన్న వస్తున్న కథనాలను శ్రీవారి భక్తకోటి ప్రపంచంలోని హిందువుల మన భావాలను తీవ్రంగా కలిసి వేసిందన్నారు. లడ్డు ప్రసాదంలో జంతువులకు వినియోగించడం అత్యంత నీచం అదే ఒకవేళ నిజమైతే హిందూ ధర్మం మీద భారీగా కుట్ర జరుగుతుందని అనుమానిస్తున్నామన్నారు. లడ్డు ప్రాముఖ్యతను తగ్గించడానికి టీటీడీపై కోట్లాది మంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని సడలించేందుకు భారీగా కుట్ర జరుగుతుందని భావిస్తున్నాం అని అన్నారు. ఉన్నత స్థాయి వ్యక్తుల పాత్ర లేనిదే ఇంత నీచమైన పనిని నిరాటంకంగా ఏళ్ల తరపున కొనసాగించే వీలు లేదు. స్థాయి వ్యక్తుల పేర్లు నిర్ధారించడంలో ఇతర రాష్ట్రాల్లో విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో సిబిఐతో సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, జిల్లా నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, మదన్ మోహన్, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, కొండేటి శేఖర్, అజయ్, యువ మోర్చా రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ చిల్లంచర్ల అభి, మేడి నవీన్, అశోక్, మనిలాల్, బొట్టు సోములు, రాజి రెడ్డి, లక్ష్మారెడ్డి, కంచుకొమ్ముల వేణు, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరాజు శివ, పెద్దబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా జిల్లా ఇంఛార్జికి ఘన సన్మానం.



**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**

నారాయణపేట జిల్లా ఎస్సీ మోర్చా ఇంచార్జి గా నియమితులైన ఎడ్ల కృష్ణన్న ను శనివారం జిల్లా కేంద్రం లో జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు టి.ఆశప్ప, జిల్లా కార్యదర్శి గోపాల్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్, కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకట య్య, మండల నాయకులు వై.నారాయణరెడ్డి, ఎస్.లక్ష్మన్, భీంరాజ్, గజేంద్ర, సూరి, రాజు, సురేష్, లింగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

**నల్లగొండ, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ డా. మద్దిలేటి పిలుపునిచ్చారు. శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మై భారత్ లో భాగంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతనలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థిని , విద్యార్థుల చేత స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేయించారు. పది కేజీల ప్లాస్టిక్ కవర్స్ తొలగించడం, క్లీన్ అండ్ గ్రీన్ ,బిల్డింగులో శుభ్రపరచడం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా యస్.ఉపేందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వలన ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి భూతం వెంటాడుతుందని కొన్ని వందల సంవత్సరాల వరకు శాపంగా మారుతుందని పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం గురించి ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కొనసాగిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా పరంగి రవి కుమార్, డా.సురేష్ కుమార్, ఐక్యూఏసికో ఆర్డినేటర్ డా. ప్రసన్న కుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషనర్ బి.నాగరాజు, యన్ యస్ యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ యమ్ వెంకటరెడ్డి, యన్ కోటయ్య , కె శివరాణి, ఏ.మల్లేశం, అనిల్ కుమార్, యమ్ సావిత్రి, తెలుగు శాఖాధ్యక్షులు డా.వెల్దండి శ్రీధర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టిన డీసీఎం..!

- తీవ్ర గాయాలతో యువకుడు అక్కడికక్కడే మృతి

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



బైక్ పై వెళుతున్న యువకుడిని ఢీ కొట్టిన డీసీఎం ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం ఉదయం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని రాజస్థాన్ ధాబా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందుగుల ఆవాస గ్రామం మలపరాజుగూడెం కు చెందిన పుట్టా శేఖర్ తండ్రి బిక్షమయ్య, వయస్సు: 32 సంవత్సరాలు, కులం: మున్నూరు కాపు, వృత్తి వ్యవసాయం అతను తన ఫ్యాషన్ ప్లస్ ఏపీ 24 ఏసీ 422 నెంబరు గల బైక్ పైన తన గ్రామం నుంచి మాడ్గులపల్లిలోని పోలీస్ స్టేషన్ కు ఎదురుగా ఉన్న హెచ్ పి పెట్రోల్ బంక్ లో డీజిల్ తీసుకుని వెళ్తుండగా రాజస్థాన్ ధాబా ఎదురుగా చేరేసరికి అతని వెనుక నుంచి ఎంపీ 07 జిబి 2786 నంబర్ గల డీసీఎం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి శేఖర్ బండిని వెనుక నుంచి ఢీకొట్టడంతో అతని ముఖం పై, ఎడమ భుజం పై, రెండు చేతులుపై, కుడి కాలుపై గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య పుట్ట మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డీసీఎం డ్రైవర్ మధ్యప్రదేశ్ కు చెందిన నిజాం ఖాన్.

## ఎన్.జి కళాశాలలో జామ్ అవగాహన సదస్సు

**నల్లగొండ, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం, గణితశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్ పైన శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వల్పకాలిక ఆలోచనలు కాకుండా దీర్ఘకాలిక ఆలోచనలు కలిగి ఉండి ఐఐటీలలో , సెంట్రల్ యూనివర్సిటీలలో, ఎన్ఐటి వంటి జాతీయ విద్యాసంస్థలలో విద్యను అభ్యసించి భవిష్యత్తును రూపొందించుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు. ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ నల్గొండ నందు సహచార్యులుగా పనిచేస్తున్న కొమ్ము నరేష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ మెంటారుగా విచ్చేసి పిల్లలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్రం, గణితశాస్త్ర విభాగాల అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, అధ్యాపకులు వేముల వెంకటేశం, మధుకర్ రెడ్డి ,కనకయ్య రజనీ ,మహేష్, సుమతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పేరు తొలగింపు. కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధితుడు.

**ఇంటిని సందర్శించిన జిల్లా కలెక్టర్**

**జగిత్యాల, సెప్టెంబర్21,(మాన సాక్షి)**



జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో ఓటర్ గుర్తింపు కార్డు తొలగించినట్లు బాధితుడు కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా, శనివారం జిల్లాలో నిర్వహించిన పర్యటనలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ బాధితుని ఇంటికి వెళ్లి పరిశీలించారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో ఓటర్ జాబితాలో బింగి నవీన్ అనే వ్యక్తి పేరు తొలగించినందుకు గాను అతను ఫిర్యాదు చేసుకోగా జిల్లా కలెక్టర్ ఆ గ్రామాన్ని సందర్శించి తొలగించి ఓటరు ఇంటికి వెళ్లి స్వయంగా వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడ అధికారులతో మాట్లాడి తొలగింపునకు జరిగిన సాంకేతిక కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడగా వారు గ్రామంలో ఇద్దరి పేర్లు ఒకే విధంగా ఉండటం వల్ల ఇటువంటి సమస్య వచ్చింది తెలిపారు. బి ఎల్ ఓ, మాట్లాడి మళ్లీ గ్రామ ఓటరు జాబితాలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

అలాగే దాంరాజ్ పల్లి గ్రామంలో ఏడవ వార్డులోని నివసిస్తున్న ఇంటి నెంబర్ ని వేరేవాడలో బదిలీ చేసినందుకు గాను వారు ఫిర్యాదు చేసుకోగా, జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించి జిల్లా డిపిఓ అధికారి తో మాట్లాడి వారి ఇంటిని యధావిధిగా ఏడో వార్డులు నమోదు చేయాలని గ్రామపంచాయతీ సెక్రటరీ ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డిఓ శ్రీనివాస్ , డిపిఓ రఘువరన్, ఎమ్మార్వో వీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారులు, మాజీ మంత్రివర్యులు కొండ లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం లక్ష్మణ్ బాపూజీ తన జీవితం అంకితం చేశారని, పోరాటంలో ఉన్నా, చట్టసభల్లో ఉన్నా అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం పరితపించిన మహానేత అన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి తెలంగాణ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. పేద ప్రజలకు అనేక సేవలందించి, బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ జీవితాశయాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

## సైకిల్ బహుకరించిన సొసైటీ అధ్యక్షులు

**లక్షెట్టిపేట్ సెప్టెంబర్ 21 మన సాక్షి**



లక్షెట్టిపేట్ మండలం సత్యసాయి నగర్ కాలనీలో అడాప్ట్ ఎ విలేజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవినింగ్ ట్యూషన్ సెంటర్లోని విద్యార్థిని 2024 సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసీ మంచి ఉత్తీర్ణత 9.5 శాతం సాధించినందుకై ఆలియాకు అడాప్ట్ ఎ విలేజ్ ఆంధ్ర తెలంగాణ కో-ఆర్డినేటర్ రత్నరాజు చేతులమీదుగా సైకిల్ అందచేశారు. దీనిలో భాగంగా సొసైటీ అధ్యక్షులు బొడ్డు రవి జోసఫ్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కఠోర దీక్షతో చదువుతూ ముందుకు సాగిపోవాలని, అప్పుడే మనం కన్న కలలు సాకారం అవుతావని గొప్పగా విద్య గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అడ్వకేట్ పాల్ సుధాకర్, ప్రభుదాస్ జిల్లపెల్లి, ఫీల్డ్ వర్కర్ సుస్మిత, చరణ్ తేజ, ఆశా కార్యకర్త హెలెన్, కిరణ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విద్య పథకం దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**

మహాత్మ జ్యోతిబాపులేవిదేశీ విద్యా పథకం కింద ఫాల్ సీజన్ కు అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు అక్టోబరు 15లోగా 'ఈ పాస్' వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ తెలిపారు. అభ్యర్థుల వయసు 35 ఏళ్లలోపు ఉండాలని, ఇంజనీర్, మేనేజ్ మెంట్, సైన్స్, వ్యవసాయం, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, అగ్రికల్చర్, హ్యూమానిటీస్లో 60 శాతం మార్కులు సాధించాలని పేర్కొన్నారు. విదేశీవర్సిటీల నుంచి ఐ-20, వీసా పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఎస్సీ మోర్చా జిల్లా ఇంఛార్జికి ఘన సన్మానం.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**



నారాయణపేట జిల్లా ఎస్సీ మోర్చా ఇంచార్జి గా నియమితులైన ఎడ్ల కృష్ణన్న ను శనివారం జిల్లా కేంద్రం లో జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివా, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్, కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకట య్య, మండల నాయకులు వై.నారాయణరెడ్డి, ఎస్.లక్ష్మన్, భీంరాజ్, గజేంద్ర, సూరి, రాజు, సురేష్, లింగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో పట్టుబడ్డ పీడీఎస్ రైస్ బహిరంగ వేలం.

జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.జితేందర్ రెడ్డి.

**జగిత్యాల, సెప్టెంబర్21,(మన సాక్షి)**

అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ పిడిఎస్ బియ్యాన్ని వేలం వేసేందుకు సివిల్ సప్లై అధికారులు నిర్ణయించారు., 1088 క్వింటాళ్ల రైస్ తో పాటుగా 167 క్వింటాళ్ల తినడానికి పనికిరాని బియ్యం వేలం వేసేందుకు ప్రకటన జారీ చేశారు. జిల్లా సివిల్ సప్లై అధికారి పేరు మీద రూ.3,000 నాన్ రిఫండబుల్ డిడి తీసిన వారు వేలంలో పాల్గొనవచ్చునని ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు వేలం వేస్తున్నట్లుగా తెలిపారు. వేలంలో పాల్గొన తలచిన వారు 2 లక్షలు ధరావత్తు గా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్ పేరున డిడి తీయవలసి ఉంటుందని పూర్తి సమాచారం కోసం జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

## ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ల సస్పెన్షన్.


జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్దన్ రావు.

**పెద్దపల్లి, సెప్టెంబర్ -21: మన సాక్షి**



కాల్వ శ్రీరాంపూర్ మండలం తారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ లను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్దన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.సదానందం (ఇంగ్లీష్ ), అబ్దుల్ ఖాదరీ (బయో సైన్స్) అనే స్కూల్ అసిస్టెంట్లను 6వ తరగతి చదువుతున్న బాలికలతో తప్పుగా ప్రవర్తించిన కారణంగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు .

# లడ్డూ వ్యవహారంలో దోషులను వదిలేది లేదు



## ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి తీరుతాం

## లోతుగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది

## అన్ని దేవాలయాల్లో పరీక్షలు, సంప్రోక్షణ కార్యక్రమాలు

## ఆరోపణలు వస్తే ఎదురుదాడితో జగన్ విమర్శలు

## మండిపడ్డ సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: తిరుమల లడ్డూ వ్యవహారంలో దోషులను వదిలేది లేదని, ఎంతటి వారైనా కఠినంగా చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి తీవ్రంగా స్పందించారు. తిరుమల లడ్డూ విషయంలో జగన్ చర్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. ఇది చాలా సున్నితమైన అంశం అని, దీనిపై లోతుగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రోజూ మూడుసార్లు పరీక్షలు చేశామని ఎవరిని మభ్యపెడుతున్నారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ ఏడు కొండలను.. రెండు కొండలు అన్నాడని.. అప్పుడు పోరాడామని సీఎం చెప్పారు. అమరావతిలో రూ. 250 కోట్లతో శ్రీవారి టెంపుల్ కడదామని భావిస్తే.. దానిని కుదించారన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పరీక్షలు, సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతామని సీఎం చెప్పారు. జగన్ పాలనలో దేవుళ్ల విగ్రహాలను ధ్వంసం చేసే ఎన్నో దుస్సాహాలు చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు.

## ఢిల్లీ సిఎంగా అతిశీ ప్రమాణం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా అతిశీ శనివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. దేశ రాజధానికి 8వ యువ ముఖ్యమంత్రి ఆమెనే కావడం విశేషం.
అతిషితోపాటు కేబినెట్‌లో కొత్త ముఖాలకు చోటిచ్చారు. నూతన మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గహ్లోత్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్ అహ్లావత్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోదియా, ఆప్ నేతలు హాజరయ్యారు. షీలాదీక్షిఆత్, సుష్మాస్వరాజ్ తరవాత అతిషి ఢిల్లీ మూడో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.

## తిరుమలలో అన్యమతస్థుల వల్లనే ఈ దుస్థితి !

తిరుమల లడ్డూకు జరిగిన అపచారం విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కల్తీ నెయ్యి అదికూడా జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడిన విషయం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. ఇందులో దోషం ఉంటే గత ఐదేళ్లుగా సాగిన వ్యవహారంపై నిజాయితీగా విచారణ జరగాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. అన్యమతస్థులకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో స్థానం లేకుండా చేయాలి. హిందూ దేవాలయాల్లో అన్యమతస్థుల జోక్యం, పెత్తనం లేకుండా చేయాలి. ఇప్పటికైనా ధర్మసంస్థలు ముందుకు రావాలి. రాజకీయ నేతలను తిరుమల బోర్డులో లేకుండా చేయాలి. జాతీయ స్థాయిలో హిందూధర్మ ప్రచారపరిషత్ ఏర్పడాలి. దేవాలయాల్లో ఇతరుల, రాజకీయాల పెత్తనం లేకుండా చేయాలి. అలాగే కల్తీ నెట్టి విషయంలో తక్షణమే చర్యలకు ఉపక్రమించాలి. ఇకపోతే కల్తీనెయ్యి ఉపయోగించారన్న విసయం బయటకు రాగానే గతంలో సిఎంగా పనిచేసిన జగన్, ఆయన హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పనిచేసిన వారు రాజకీయ విమర్శలు చేయడం ఇంకా పాపం. వారి మనోభావాలు దెబ్బతినే వ్యవహారం కాదు కనుక దీనిని రాజకీయ కోణంలోనే చూశారు. చంద్రబాబు రాజకీయ ఎత్తుగడలు అని జగన్ వ్యాఖ్యానించడానికి మించిన పాపం మరోటి కాదు. నిజానికి ఈ వ్యవహార మంతా జగన్ కనుసన్నల్లోనే జరిగిందని భావించాలి. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న విషయం బయటకు రావడంతో వైసీపీ అధ్యక్షులు జగన్ కించిత్ కూడా భయం లేదా బాధను వ్యక్తం చేయడం లేదు. ఇదేదో చంద్రబాబు వ్యవహారంగా కొట్టి పారేశారు. ఇలా జరిగిన విషయం తెలియగానే అందుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరుతారని అంతా భావించారు. కానీ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ అంటూ చేసిన ప్రకటన ఈ దోషం నుంచి తప్పించుకునే చర్యలకు పరాకాష్టగా చూడాలి. వైకాపా పార్టీ శ్రేణులు జగన్ వైఖరిపై తమ అభిప్రాయాలను చెప్పాలి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనే.. జగన్ తాబేదారులు అయిన అన్యమతస్థులు టిటిడి ఛైర్మన్లుగా ఉన్న సమయంలోనే ... తిరుపతి లడ్డూ నాణ్యత, రుచి తగ్గిందంటూ వరుస ఆరోపణలు వచ్చాయి. ప్రసాదం లడ్డూ నాణ్యతలో రాజీపడేది లేదంటూ అప్పటి ప్రభుత్వం వివరణ ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రసాదం తయారీలో రుచిని పెంచేది నాణ్యమైన నెయ్యి. ఆవునెయ్యి ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. అందుకే వైద్యశాస్త్రంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయుర్వేద వైద్యంలో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అలాంటి ఆవునెయ్యి రోజుకు వందల కిలోలు తిరుమల శ్రీవారి లడ్డూ తరయారీలో వినియోగానికి అవసరం. ఇలాంటి నెయ్యి విషయంలో, స్వామి వారికి నైవేద్యం విషయంలో ఇతర మతాల వారికి విశ్వాసం ఉండకపోవచ్చు. ఇప్పుడు అదే జరిగింది. గత ఐదేళ్లో తిరుమలలో ఇంకేం జరిగిందన్నది కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఉంది. ఎందుకంటే శ్రీవారికి ఆవు నెయ్యి పేరుతో సరఫరా చేసిన నేతిలో కల్తీ జరిగిందంటూ ప్రస్తుతం ల్యాబ్ నివేదికలు బయటపడ్డాయి. దీంతో ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా ఈ అంశం కలకలం రేపింది.



## శ్రీవారి లడ్డూలో కల్తీతో మహాపచారం

**ప్రాయశ్చిత్త దీక్షకు పవన్ నిర్ణయం**

**నేటి నుంచి 11 రోజులపాటు దీక్ష**

**తరవాత శ్రీవారిని దర్శించుకుంటానని వెల్లడి**

**అమరావతి:** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. కలియుగ ప్రత్యక్ష దైవం బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందేనన్నారు. అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకులు వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైంది. జంతు అవశేషాలతో మలినమైంది. విశృంఖల మనస్కులే ఇలాంటి పాపానికి ఒడిగట్టగలరు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం నా మనసు కలత చెందింది. అపరాధ భావానికి గురైంది. ప్రజా క్షేమాన్ని కాంక్షించి పోరాటంలో ఉన్న నా దృష్టికి ఈ అంశం రాకపోవడం బాధించింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందే. అందులో భాగంగా నేను 'ప్రాయశ్చిత్త' దీక్ష చేయాలని సంకల్పించానని వెల్లడించారు. ఆదివారం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీదశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష చేపడతా. 11 రోజులపాటు దీక్ష కొనసాగించిన అనంతరం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటా. 'దేవదేవా... నీ పట్ల గత పాలకులు చేసిన పాపాలను ప్రక్షాళన చేసే శక్తిని ఇవ్వమని వేడుకుంటానని అన్నారు. భగవంతుడిపై విశ్వాసం, పాప భీతి లేనివారే ఇలాంటి అకృత్యాలకు ఒడిగడతారు. నా బాధేమిటంటే– తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవస్థలో భాగమైన బోర్డు సభ్యులు, ఉద్యోగులు సైతం అక్కడి తప్పిదాలను కనిపెట్టలేకపోవడం. కనిపెట్టినా నోరు మెదపకపోవడం. నాటి రాక్షస పాలకులకు భయపడి మిన్నకుండిపోయారా అనిపిస్తోంది. వైకుంఠ ధామంగా భావించే తిరుమల పవిత్రతకు, వేదాచారాలకు, ధార్మిక విధులకు కళంకం తెచ్చే విధంగా పెడపోకడలకు పాల్పడిన గత పాలకుల తీరు హిందూ ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరినీ బాధించింది. ఇక లడ్డూ ప్రసాదం తయారీలో జంతు అవశేషాలు ఉన్న నెయ్యిని వినియోగించారనే విషయం తీవ్ర క్షోభకు గురి చేసింది.

## క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



**సూర్యాపేట,సెప్టెంబర్ 21,మన సాక్షి:**

స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్-ఎస్ యూనిట్ 1,2 విద్యార్థులు సూర్యాపేట మున్సిపాలిటీ వారి సహకారంతో ఈరోజు పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ లో సిఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్సై కుశలవ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్ సానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్, సతీష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు భావనజ్యోతి, శిరీష, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులకు సేవా గుర్తింపుకు సన్మానం

**లక్షెట్టిపేట్ సెప్టెంబర్ 21 మన సాక్షి**



విద్యుత్ అధికారుల సేవలను గుర్తించి ఉత్తమ గుర్తింపు ఇస్తున్న సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలలో భాగంగా లక్షెట్టిపేట ఏడిఈ, ప్రభాకర్ రావుకి ఉమ్మడి ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలో ఆగస్టు నెల లో ఉత్తమ ఏడిఈ గా ఎంపికయ్యారు. మంచిర్యాల సర్కిల్ పరిధిలో లక్షెట్టిపేట ఏఈ గణేష్ కు మొదటి ర్యాంకు రావడంపై లక్షెట్టిపేట్ సెక్షన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం లక్షెట్టిపేట సబ్ డివిజన్ లో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీఈ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ అధికారుల పనితీరును గుర్తించి ర్యాంకులతో వారిని ప్రోత్సహిస్తున్న సీఎండి కర్నాటి వరుణ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .ప్రతి ఉద్యోగి వృత్తే ధ్యేయంగా పనిచేస్తే ప్రజల్లో, అధికారులలో మంచి గుర్తింపు తప్పక వస్తుందన్నారు. కిందిస్థాయి ఉద్యోగులు పనిచేస్తేనే అధికారులకు మంచి పేరు వస్తుందని అన్నారు. వినియోదారులకు మరిన్ని సేవలందిస్తూ మెరుగైన విద్యుత్ సరఫరకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ దివాకర్, లైన్మెన్లు పూరెల్ల నాగన్న, నేల్కిమల్లేష్, చంద్రమౌళి, కొట్టేసత్యం,సతీష్, చందు, నాగరాజు.సందీప్, రాజు.తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు,పెన్నులు,స్వీట్లు పంపిణీ

**లక్షెట్టిపేట్ సెప్టెంబర్ 21 మన సాక్షి**




మంచిర్యాల నియోజకవర్గ శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పుట్టినరోజు సందర్భంగా లక్షెట్టిపెట మున్సిపాలిటీ 9వ వార్డు సభ్యులు పట్టణ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆయిల్ల విజయ్ అధ్వర్యంలో శనివారం రోజున 9వ వార్డు పరిధి లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో పుస్తకాలు,పెన్నులు,స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి సేవా చేయడంలో ప్రేమ్ సాగర్ రావు మాకు ఆదర్శం అని ,నియోజకవర్గ ప్రజలకి,పేదలకి వారు చేస్తున్న సేవలు చరిత్రలో నిలిచి పోతాయని అన్నారు. కొక్కిరాల రఘుపతి రావు ట్రస్టు ద్వారా వారు ప్రతి సంవత్సరం వేసవిలో మంచి నీరు,అంబలి కేంద్రాలు, రక్త దాన శిబిరాలు,బతుకమ్మ చీరల పంపిణీ,ఆసుపత్రిలో ఉన్న పేదలకి ఆహారం అందించడం,కరోనాలో కూడా విస్తృత మైన సేవలు అందించిన గొప్ప మనసు ప్రేమ్ సాగర్ రావుది అని కొనియాడారు. పాలన లో కూడా అభివృద్ధి లో ఆయన మార్క్ కనపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి రవి,చిట్టిమల్ల దిలీప్,దుంపల సోను, శనిగారపు సంతోష్,శనిగరపు దినేష్ పాల్గొన్నారు.

## బాలబాలికల హ్యాండ్ బాల్ సెలక్షన్ ట్రయిల్స్ జిల్లా టీం ఎన్నిక.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ సెలక్షన్ ట్రయిల్స్ మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జట్టు ఎన్నిక ఈ నెల 24న నారాయణపేట జిల్లా కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించబడును అని నారాయణపేట జిల్లా క్రీడా సమాఖ్య అధ్యక్షుడు నర్సిములు ఒక ప్రకటనలో తెలిపారు ఈ పోటీలో పాల్గొనదల్చిన బాలబాలికలు తమతో పాటు ప్రస్తుత చదువుతున్న బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఇంటర్ విద్యార్థులైతే పదవ తరగతి మెమో జిరాక్స్ ను తమ వెంట తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాల సమాచారం కోసం బాలరాజు పీడీ 9120799991 ను సంప్రదించాలని కోరారు.

## మంథని బిల్ కలెక్టర్ సస్పెన్షన్. ఉత్తర్వులు జారీ చేసిన

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**పెద్దపల్లి, సెప్టెంబర్- 21: మన సాక్షి**

అవినీతి ఆరోపణ నేపథ్యంలో మంథని మున్సిపాల్టీలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంథని పట్టణ నివాసి సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సెప్టెంబర్ 19, 2024 నాడు బిల్ కలెక్టర్ రాజు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేస్తూ దరఖాస్తు సమర్పించారు. ఇంటి పన్ను 50 వేలు పెండింగ్ ఉన్న నేపథ్యంలో పునః పరిశీలించే అంశంలో బిల్ కలెక్టర్ ను ఫిబ్రవరి 2024 నెలలో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సంప్రదించగా 25 వేల రూపాయలు చెల్లించాలని చెప్పారని, 14 వేల రూపాయల నగదు, ఫోన్ పే ద్వారా 11 వేలు చెల్లించిన తర్వాత ఇంటి పన్ను రసీదు కోరగా, 647 రూపాయలకు మాత్రమే ఇంటి పన్ను రసీదు అందించారని ఫిర్యాదులో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ తెలిపారు. సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ ఫిర్యాదు, అందుబాటులో ఉన్న ఆధారాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్ బిల్ కలెక్టర్ ను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. సస్పెన్షన్ కాలంలో బిల్ కలెక్టర్ మంథని హెడ్ క్వార్టర్ అనుమతి లేకుండా వదిలి వెళ్ళవద్దని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పెరుగుతున్న వీధి గ్రామ సింహాలు స్వైర విహారం..!

**రామసముద్రం సెప్టెంబర్ 21, మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం లోని ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రావాలంటే భయపడుతున్న మండలంలోని ప్రజలు రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కలు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు. ఎందరో కుక్కలు దాడిలో గాయపడ్డారు. ఉదయం పూట పిల్లలను స్కూలుకు వదలాలంటే భయం ఒంటరిగా బయటికి రావాలంటే భయపడుతున్న మహిళలు. మండలంలో అనేకసార్లు ప్రజల మీద దాడి చేసిన కుక్కలు అయినప్పటికీ పట్టించుకోని అధికారులు. కనీసం దీనిపైన ప్రజాప్రతినిధులైన పట్టించుకుని అధికారుల ద్వారా ఈ కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్న మండల ప్రజలు. ఇది ఇలాగే కొనసాగితే మండలంలో జనం కంటే కుక్కలు ఎక్కువ అవుతాయని వాపోతున్న జనం ఇప్పటికైనా అధికారులు దీనిమీద స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని కోరారు.

## జహంగీర్ పీర్ దర్గాలో మిలాద్ ఉన్ నబి వేడుకలు.

**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, సెప్టెంబర్ 21, మనసాక్షి :**



శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యమత్యమే మహాబలమని ప్రతి ఒక్కరు మొహమ్మద్ ప్రవక్త (సల్లెల్లాహు అలైహి వసల్లెం) బోధించిన సన్మార్గంలో నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామంలో ఏక్ మినార్ మజీద్ నుండి హజరత్ జహంగీర్ పీర్ దర్గా వరకు కడప పీర్ భాయ్ ల ఆధ్వర్యంలో స్థానిక మైనార్టీ యువత భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంషాబాద్ ఏసిపి శ్రీనివాసరావు తదితర పోలీసు అధికారులు హాజరుకాగా, కొత్తూరు మండల మాజీ జెడ్పీటిసి కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పిసిసి సభ్యులు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మెహమ్మద్ ఇబ్రహీం, గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రఘునాయక్, సీనియర్ నేత హరినాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి మిలాద్ నబీ ర్యాలీ ప్రదర్శనకు సంబంధించిన ప్రత్యేక ప్రార్ధనలను చేసి బాబాకు దట్టీలు సమర్పించారు. అనంతరం స్థానిక నాయకులు ముఖ్య అతిథులు ప్రజలకు అన్నదానం చేశారు. ఇనుముల్ నర్వ గ్రామం నుండి అంగరంగ వైభవంగా భారీ ఎత్తున వందలాదిమంది మైనార్టీ యువత వాహనాలపై ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో స్థానిక కడప పీర్ భాయ్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## గెవితిమ్మరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**రామసముద్రం సెప్టెంబర్ 21, మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని కొండపై వెలిసిన గెవితిమ్మరాయ స్వామి ఆలయం లో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బట్టర్ స్వామివారికి ఆలయం శుద్ధి ఉదయం పలు రకాల పుష్పములతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు గోవిందా గోవిందా అంటూ నామస్మరణలతో మారి మ్రోగిన గెవితిమ్మరాయ స్వామి ఆలయం. స్వామిని దర్శించు కున్న ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరెడ్డి, అగిస్తప్ప వీరికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలాగే చెంబకూరు రోడ్డులోని శనేశ్వర స్వామి ఆలయం లో స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## బుద్ధవనం సందర్శించిన భూటాన్ అధికారులు

**నాగార్జునసాగర్ ,సెప్టెంబర్, 21. మన సాక్షి :**



తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ లో నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు బుద్ధవనాన్ని భూటాన్ దేశపు పోలీస్ అధికారుల బృందం శనివారం సందర్శించారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేక అధికారి ప్రకాష్ రెడ్డి తెలిపారు. భూటాన్ పోలీసు శాఖ డిప్యూటీ చీఫ్( ఫైనాన్స్ )వాంగ్ చుక్లా , పోలీసు ఉన్నతాధికారి ఉగ్యేన్ రిక్ జిన్ నేతృత్వంలో ఆరుగురు పోలీసు అధికారుల బృందం బుద్ధ వనాన్ని సందర్శించారు. వీరు హైదరాబాదులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణను పూర్తిచేసుకుని బుద్ధవనం సందర్శనకై వచ్చారు . దీనిలో భాగంగా మహా స్తూపం చుట్టూ ఉన్న బౌద్ధ శిల్పాలను, లోపల ఉన్న బుద్ధ దాతు పేటికలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు , ప్రపంచ శాంతి కి బుద్ధవనం మహాస్తుప సందర్శన చక్కటి మార్గదర్శకంగా నిలుస్తుందని, ఈ పర్యటన తమకు ఎంతో తృప్తినిచ్చిందని, బుద్ధుని బోధనలు, బౌద్ధ వాస్తు శిల్ప సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు తెలుసుకునే అవకాశం దక్కిందని భూటాన్ పోలీస్ అధికారుల బృందం తెలిపారు. అంతకుముందు ఈ బృందం నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించి అనంతరం అక్కడ పునర్ నిర్మిత నిర్మాణాలైనా మహా స్థూపాన్ని , సింహళ విహారాన్ని సందర్శించారు .ఈ బృందానికి బుద్ధవనం ,నాగార్జునకొండ ,నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ చారిత్రక వివరాలను పర్యాటకశాఖ గైడు సత్యనారాయణ వివరించారు.

## స్వచ్ఛత హి సేవా కార్యక్రమం

**రామసముద్రం సెప్టెంబర్ 21, మన సాక్షి:**




అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీలోని తిరుమలరెడ్డిపల్లె గ్రామంలోని ప్రభుత్వపాఠశాల లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప నాయుడు, సెక్రటరీ బానుమూర్తి జడ్పీ హైస్కూల్ చైర్మన్ కృష్ణప్ప పాఠశాల హెచ్ ఎం మోహన్ నాయక్ అధ్యక్షత నిర్వహించారు విద్యార్థులకు స్వచ్ఛత హి సేవా యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ మనం పరిశుభ్రంగా ఉంటూ మన పరిసరాలను కూడ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్నా రెడ్డెప్పనాయుడు, బానుమూర్తి, కృష్ణప్ప, మోహన్ నాయక్, హరినాయుడు అమర కార్మికులు అలాగే కార్మికులకు ప్రభుత్వం తరుపున బట్టలు పంపిణీ చేశారు.

## అంగన్ వాడీ కేంద్రాల్లో పోషన్ అభియాన్



**వేములపల్లి సెప్టెంబర్ 21 మన సాక్షి**

పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో అంగన్ వాడి కేంద్రంలో పోషన్ అభియాన్ కార్యక్రమాన్నీ అంగన్వాడి టీచర్స్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్ వాడి సూపర్ వైజర్ పరిమి రజిని మాట్లాడారు. తల్లులకు పిల్లల పోషణ, గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ స్త్రీ అంగన్వాడి కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. గర్భవతులకు ఆకుకూరలు కూరగాయలు తింటే రక్తహీనతనం నివారించవచ్చున్నారు. ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతపై వివరించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అనంతరం పోషణ మాంసంపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ కళావతి జ్యోతి సంజత ఆయా దేవకమ్మ,తల్లులు, చిన్న పిల్లల , పాల్గొన్నారు.

## తుంగతుర్తి ఎమ్మెల్యేను కలిసిన సామ అభిషేక్ రెడ్డి




**అర్వపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి:**

తుంగతుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పది సంవత్సరాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ అభివృద్ధి కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు తెలిపారు. శనివారం ఎమ్మెల్యేని కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులను నిధులను , విధులను, తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారని అన్నారు. 32 కోట్ల రూపాయలతో తిమ్మాపురం సంఘం, మరియు సంఘం నూతనకల్, రోడ్లను మరమ్మత్తు చేస్తున్నట్లు తెలిపారు, అదేవిధంగా తిమ్మాపురం కోడూరు వరకు రోడ్డు మరమత్తుతోపాటు నాలుగు బ్రిడ్జిలు నిర్మిస్తామని అన్నట్టు తెలిపారు. అర్వపల్లి నుండి కాసర్లపాడు మీదుగా కొమ్మాల వరకు రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చినట్లుతెలిపారు. త్వరలోనే క్యాబినెట్ మంత్రులతో నియోజకవర్గ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మారోజు బ్రహ్మచారి, సామ సతీష్ రెడ్డి, నిద్ర సంపత్ నాయుడు, పాల్గొన్నారు.

## పార్లమెంట్ నిధులతో మండలాన్ని అభివృద్ధి చేయాలి

### - డిసిసి ఉపాధ్యక్షుడు ధరూరి

**అర్వపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న జాజిరెడ్డిగూడెం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరించాలని బోనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు. శనివారం పార్లమెంటు సభ్యుని క్యాంపు కార్యాలయంలో మండల ముఖ్య నాయకులతో కలిసి మండలంలోని సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా వర్షాలతో దెబ్బతిన్న రోడ్లని వెంటనే మరమ్మత్తు చేయవలసిందిగా కోరారు, ఎంపీ నిధుల నుండి మండలంలోని లింకు రోడ్ల తోపాటు, బొల్లంపల్లి, వేల్పుచర్ల, కొత్తగూడెం, రహదారులను నిర్మించాలని కోరారు. డిసిసి ఉపాధ్యక్షుడు యుగానందచార్యులు కోరిన రోడ్లకు వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మొరపాక సత్యం, నర్రా సురేష్, గంట జయంత్, పాల్గొన్నారు.

## యువత బాపూజీని ఆదర్శం తీసుకోవాలని

**మిర్యాలగూడ టౌన్, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



తెలంగాణ మలి దశ ఉద్యమ కారులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12 వర్ధంతి సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ ఆధ్వర్యంలో వారి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమ నాయకులు సామాజిక ప్రజా సేవకులు మన బాపూజీ యాదిలో వారు తెలంగాణ కోసం ఎప్పుడు కలకనీవాడని ఆకల నెరవేర్చిన ముందే ఈ లోకాన్ని విడిచిపెట్టి పోవడం చాలా బాధాకరమని ఆయన బాబుధ్యానికి లోనయ్యారు. వందేమాతరం కిట్ ఇండియా ఉద్యమాలు బాపూజీ భాగ్యసమయ్యారని ఆయన తెలిపారు. తొలి దశ మలిదశ తెలంగాణ ఉద్యమానికి వారి జలదృశ్యం నివాసం ఉద్యమానికి వేదికాని వారన్నారు. వారి పోరాట స్ఫూర్తి మార్గదర్శకమని ఆయన తెలిపారు. తెలంగాణ రావడానికి బాపూజీ ఆధ్యులు అని , బాపూజీ త్యాగానికి తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవదని ఆయన పేర్కొన్నారు. నేటి యువత బాపూజీని ఆదర్శం తీసుకోవాలని ఆయన ఉద్యమ స్ఫూర్తిని పొందాలని ఆయన పేర్కొన్నారు. మూడు తరాల ఉద్యమ యోధుడిని వారన్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న గౌడ్,బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్,పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న, శ్రీనివాస్ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి సంఘం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**జగిత్యాల, సెప్టెంబర్21,(మన సాక్షి)**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జగిత్యాల పట్టణ పద్మశాలి సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో అంగడి బజార్ లో గల విగ్రహానికి జగిత్యాల పలువురు పద్మశాలి నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి, జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జగిత్యాల పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బోగ గంగాధర్, గాదాసు రాజేందర్, బోగ రాజ్ కుమార్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు ఆకుబత్తిని శ్రీనివాస్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు కుల బాంధవులు పాల్గొన్నారు.

మల్లాపూర్ మండల కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం దగ్గర మండల అధ్యక్షులు అయ్యోరి దశరథం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ వైద్యాధికారిని వాహిని హాజరయ్యారు. అలాగే మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టడి నారాయణరెడ్డి, పద్మశాలి జిల్లా కార్యవర్గ సభ్యులు సంబారి శంకర్, సిరిపురం రవీందర్ ,రుద్ర రమేష్ , రుద్ర రాజ్ కుమార్ ,మొర సతీష్ రుద్ర రాంప్రసాద్, రాకేష్, మద్రిపల్లి మల్లయ్య, ఎర్ర భూమయ్య, కోటగిరి ఆనంద్, రామలక్ష్మణ, సుంకేటా నారాయణరెడ్డి,ఉరెడి రవి తదితరులు పాల్గొన్నారు

## పింక్ డే నిర్వహించిన మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు

**అర్వపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



మండల కేంద్రంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ పాఠశాల నందు శనివారం పింక్ డే నిర్వహించారు. అదేవిధంగా, టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ లను బహుకరించారు .విద్యార్థులలో వివక్ష లేకుండా ఒకరిని ఒకరు తిట్టుకోవడం బెదిరించడం, వివక్ష చూపించడం లాంటి సమస్యలను విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు వి పిన్ కుమార్, ఇన్చార్జి గిరిజ, హెడ్మాస్టర్ అమర్, ఉపాధ్యాయులు, చంద్రశేఖర్, రమ, రజిత, మమత జ్యోతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువును తలపిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల..!

**చింతపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి.**



చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామంలో 1975లో ఏర్పాటు చేసిన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనందుకొని దేశ విదేశాలలో ఉన్నత స్థానాలకు ఎదిగారు కానీ నేడు ఆ పాఠశాల ఇప్పటికీ నీ అభివృద్ధికి నోచుకోకపోవడం గమనహరం. చిన్నపాటి వర్షం వచ్చిందంటే పాఠశాలలో చెరువును తలపించే విధంగా నీరు బయటికి వెళ్లకుండా పాఠశాల ఆవరణలోనే నిలిచిపోవడంతో పాఠశాలలో చదువుకునే విద్యార్థులు మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాల స్వయంగా స్వర్గీయ మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. సుమారు 49 సంవత్సరాల నుండి ఆ పాఠశాలలో కొంత మార్పులు చేర్పులు, అదనపు తరగతి గదులు విద్యా వ్యవస్థ సమకూరుస్తున్నప్పటికీ పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేక పోతుంది. ఒకానొకప్పుడు చింతపల్లి మండలం లో గడియ గౌరారం, గ్రామంలో మాత్రమే పదవ తరగతి వరకు పాఠశాల నడిచేది తదనంతరం చింతపల్లి, వెంకటం పేట (తీదే డు ) కురుమేడు, వెంకటేశ్వర నగర్ (మాల్ ) కురంపల్లి గ్రామాలలో జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలు వెలిశాయి. అయినప్పటికీ విద్యా వ్యవస్థలో మార్పులు జరుగుతున్నప్పటికీ ఆ పాఠశాల లు పూర్తి అభివృద్ధికి నోచుకోకపోవడం చెప్పుకోదగ్గ విషయం. ప్రస్తుతం గడియ గౌరారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో 163 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. మండలంలో ఉన్న మిగతా పాఠశాలలో అభివృద్ధి కొంతమేరకు మెరుగైనప్పటికీ గడియ గౌరారం పాఠశాలను మాత్రం ఆటు విద్యా వ్యవస్థ, కానీ ఇటు ప్రజాప్రతినిధులు గాని ఆ పాఠశాలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురకాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు మండల విద్యాశాఖ అధికారికి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య ను ఏ ఒక్కరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . దీంతోపాటు కోతుల బెడదతో అధికంగా ఉండడంతో ఆపాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం చేయాలంటే కోతులు వచ్చి ఎప్పుడు దాడి చేస్తాయోనని విద్యార్థులు విద్యార్థులు భయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత జిల్లా విద్యా వ్యవస్థ అధికారులు కానీ, మండల అధికారులు గాని పాఠశాలలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించి విద్యార్థులను కోతుల బెడద నుండి కాపాడంతో పాటు పాఠశాలలో చెరువును తలపించే వర్షపు నీటి సమస్యపై కూడా చర్యలు తీసుకొని పాఠశాలలో నీటిని నిలవకుండా మొరం మట్టిని పోయించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# ఇంట్లో పాత వస్తువులు ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇవ్వండి:

## మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 21: (మన సాక్షి)**



ఇంట్లో వాడని పాత వస్తువులు ఉంటే ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇవ్వాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ పరిధిలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూస్, రీసైకిల్) సెంటర్ వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తను తగ్గించాలని, ప్లాస్టిక్ ను వినియోగించకుండా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రకృతిలో కలిసిపోయే వాటినే వినియోగించాలని, చెత్తను వేరు చేసి తిరిగి ఉపయోగించడం రీసైకిల్ చేయడం అనగా కంపోస్ట్ మొదలగునవి చేయుటకు ప్రతి ఇంట్లో అనవసరంగా ఉన్న వస్తువులను, పుస్తకాలను, చెప్పులు, బెల్టులు, బట్టలను రోడ్లపై పడేయకుండా ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇచ్చినట్లయితే పేద ప్రజలకు ఉపయోగపడతాయని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్ పి లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 21 మన సాక్షి:**



విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని మంగాపురంతండా లో శనివారం జరిగిన పేరెంట్స్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రభుత్వం విద్య కు పెద్ద పీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ విద్య ను బలపేతం చేసేందుకు అవసరమైన సౌకార్యలు కల్పింస్తుందని అన్నారు. ప్రవేట్ కు దీటుగా బోధన చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదే విధంగా విద్యార్థుల పై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాల పై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. టై.బెల్ట్ . లు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కు ఆటల, –పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ పంచాయతీ. కార్యదర్శి రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.ఆనంద్, వెంగళరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చట్ట సభల్లో బిసి మహిళాలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

**సూర్యాపేట,సెప్టెంబర్ 21,మన సాక్షి:**




బిసి మహిళలకు చట్టసభలలోకి రాజకీయ రిజర్వేషన్ కోసం ఉద్యమించాలని ప్రముఖ న్యాయవాది పూర గాయత్రి డిమాండ్ చేశారు.శనివారం సూర్యపేటలో జరిగిన బిసి మహిళా కోటా అనే అంశం మీద జరిగిన జిల్లా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో ప్రముఖ కవి, రచయిత దాసోజు లలిత సారథ్యంలో జరుగుతున్న ఉద్యమానికి తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా దాసోజు లలిత మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గత యేడాది తెచ్చిన మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టంలో బిసిలకు కోటా ఇవ్వక పోవడం అన్యాయమని అన్నారు. చట్టసభలలో బిసి మహిళా రాజకీయ రిజర్వేషన్ సాధించే వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.జిలుకర శ్రీనివాస్ బిసి మహిళా ఉద్యమానికి మద్దతు పలికారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వనిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మహిళలు హుజూర్‌నగర్ నుండి హైదరాబాదు వరకు పాదయాత్ర చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12 వ వర్ధంతి సందర్భంగా మేమేంతో మాకంత వాటా అని మహిళా రాజకీయ రిజర్వేషన్లలో బీసీ మహిళా కోటా సూర్యాపేట జిల్లా సదస్సు లో మహిళలు మేమేంతో మాకంత వాటా మాకు కావాలి అని మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం కుల గనణ జరిపించాలి. ఈ జిల్లా సదస్సు ఏకగ్రీవంగా ఈ కింది తీర్మానాలను ఆమోదించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది లక్ష్మీదేవి అడ్వకేట్ ఉపెంద్ర బాయి, మారోజు సృజన,దుర్గా రాణి,విజయ విప్లవ శ్రీ,బి త్రివేణి, జానకి,గోపి,భవాణి,సర్పల సంధ్యారాణి, ఒరిరాల సుజ్జి,జనార్ధన్ తగుళ్ళ,అవుల నాగరాజు,నిమ్మల వీరన్న,పోలా జనార్ధన్ దాసోజు కృష్ణమాచారి ,రాకేష్ పోలోజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాడ్రన్ కాలనీ ఏర్పాటు చేయండి.

## మంత్రి శ్రీనివాస్ రెడ్డికి కలిసి వినతిపత్రం

**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, సెప్టెంబర్ 21, మనసాక్షి :**



షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం సిద్దాపూర్ ప్రభుత్వ భూములు మాడ్రన్ కాలనీని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్ లో ఆయన కార్యాలయంలో కలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ సిద్దాపూర్ ప్రభుత్వ భూముల వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రికి లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి మంత్రి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం వేడుకలు

**అడవిదేవులపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



1వ నుండి 30 వరకు నిర్వహించే పోషణ మాసంలో భాగంగా శనివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఎన్ చంద్రకళ పాల్గొని, మాట్లాడారు కిషోర బాలికలు రక్తహీనత భారి నుండి కాపాడుకోవాలని సమతుల్ ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే వ్యక్తిగత శుభ్రత కూడా చాలా అవసరమని వివరిస్తూ,ఆడపిల్లలు మంచి చెడు టచ్చుల గురించి బాల్య వివాహాలను నిర్మించాలంటే బాలికలు విద్యారంగంలో ముందుండాలని వివరించారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సురేష్ కుమార్,ఏపీఎం శేషయ్య, మండల వైద్యాధికారి రామాంజనేయులు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి,పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య,సిహెచ్ఓ షాహిద్,అంగన్వాడీ టీచర్స్ నారాయణమ్మ,శోభ, రమాదేవి, మణెమ్మ,రేణుక ఆశాలు, కిశోర బాలికలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న వెంకట్ గౌడ్



**కొల్చారం, సెప్టెంబర్ 21, మన సాక్షి**

మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలో ని పొతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన దుర్గమ్మ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందడం తో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 5000 రూపాయలు మండల గౌడ సంఘం అధ్యక్షుడు, అప్పాజీ పల్లి మాజీ సర్పంచ్ నాయిని సునీత వెంకట్ గౌడ్ అందజేసి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డమీది నర్సింలు. కొమ్ముల యాద గౌడ్, చిట్యాల యాదయ్య, మాజీ ఎంపిటిసి సాయిని సిద్దిరాములు, కొమ్ముల రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ రాజ్ కుమార్ కు అలయన్స్ క్లబ్ ఘన సన్మానం.



**ధర్మవరం సెప్టెంబర్ 21 మన సాక్షి**

పెద్దపెల్లి జిల్లా, ధర్మారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు నూతన ప్రిన్సిపల్ గా ఈరవేణి రాజ్ కుమార్ పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా అలయన్స్ క్లబ్ సభ్యులు పూల బొకేతో మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించి, స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మామిడి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ యంగ్ అండ్,డైనమిక్ ప్రిన్సిపాల్, గ్రేట్ అడ్మినిస్ట్రేటర్ రాజ్ కుమార్ చిన్న అనుభవం గల వయసులోనే గొల్లపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గా 12 సంవత్సరాలలో ఎన్నో అద్భుతమైన రాష్ట్ర ఫలితాలను విజయాలుగా సాధించి, ఎంతోమంది సాధారణ పేద, మధ్యతరగతి విద్యార్థులను అసాధారణంగా,అత్యున్నతంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా ఈ మధ్య జరిగిన బదిలీల ద్వారా మన ఆదర్శ పాఠశాలకు ప్రిన్సిపాల్ గా పదవి బాధ్యతలు చేపట్టినందుకు మన ధర్మారం మండల ప్రజలు ఎంతో అదృష్టవంతులు. వారిని ఈరోజు ఈ సందర్భంగా సన్మానించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిధులు జిల్లా 258 రీజినల్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్ గౌడ్, అధ్యక్షులు మామిడి శెట్టి శ్రీనివాస్, కోశాధికారి తోడేటి మురళి గౌడ్, పి ఆర్ ఓ కందుల సతీష్, ఉపాధ్యక్షులు బైరి చంద్రమౌళి, కందుల సతీష్, బొల్లం మల్లేశం, తోడేటి సతీష్ గౌడ్, మరియు పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని అవమానించడమే..!

**రామసముద్రం,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని చెంబకూరు పంచాయతీలో తిరుమల లడ్డు కల్తీ నెయ్యి పై నిరసన గత ప్రభుత్వ సమయంలో తిరుమల లడ్డు తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించడం హిందూ ధర్మాన్ని అవమానించడమే కాక చట్టరీత్యా నేరం అందుకు నిరసనగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు చెంబకూరులో హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల నెయ్యిలో కల్తీ చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజం ఆనంద్ కుమార్ నాయుడు, బిజెపి కృష్ణమూర్తి, శ్రీనివాస మోదీ, రామూర్తి, రంగాని వెంకటేష్, శీన, రమేష్, గుర్రప్ప, గంగాధర్, టైలర్ మని, వెంకటరమణ, లక్ష్మన్న,మేస్త్రి కిట్టన్న తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేడు బుద్ధవనానికి 200 బైకుల ర్యాలీ

## - టీజీ టీడీసీ,ఎండి బుద్ధవనం ప్రత్యేకాధికారి ప్రకాష్‌రెడ్డి

**నాగార్జున సాగర్, సెప్టెంబర్, 21, మన సాక్షి :**

తెలంగాణా పర్యాటకాభివృద్ధి సంస్థ (టీజీటీడీసి), హైదరాబాద్ బైక్ రైడర్స్‌తో కలసి 200 మోటార్ సైకిళ్లతో నాగార్జున సాగర్‌లోని బుద్ధవనానికి 'నిర్వాణ టటడ్' అనే ర్యాలీని ఆదివారం నిర్వహిస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, మరియు బుద్ధవనం ప్రత్యేకాధికారి, ఎన్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని ది ప్లాజా హోటల్ వద్ద ఆదివారం ఉదయం 7 గంటలకు మోటారు సైకిళ్ల ర్యాలీని పర్యాటక, సాంస్కృతిక శాఖా మాత్యులు జూపల్లి కృష్ణారావు, జెండా ఊపి ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంలో తెలంగాణా పర్యాటకశాఖ వృద్ధి సంస్థ ఛైర్మన్, పటేల్ రమేష్‌రెడ్డి, పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శి, వాణీప్రసాద్, టీజీటీడీసీ, ఎండి. ఎన్. ప్రకాష్‌రెడ్డి పాల్గొంటారని ఆయన చెప్పారు.ఈ ర్యాలీ బుద్ధవనానికి మధ్యాహ్నం 12:00 గం?లకు చేరుకొంటుందని, ఆ తరువాత మోటారు బైకు రైడర్స్, బుద్ధవనాన్ని సందర్శిస్తారని ప్రకాష్‌రెడ్డి చెప్పారు.

# తహసీల్దార్ కార్యాలయంలో అంతా బురదే

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 21 మనసాక్షి**




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని కాప్రా తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లాలంటే బురదలో నడుచుకుంటూ వెళ్లాలి. ప్రజల కార్యకలాపాలు నిర్వహించే కార్యాలయం ఎదుట ఇలాంటి బురద ఉంటే పట్టించుకోని అధికారులు. ప్రజలకు మెరుగైన సేవలు అందించలేరు. కనీసం కార్యాలయాన్ని కూడా పట్టించుకోకుంటే ఎలా అని ప్రజా కార్యాలయానికి వెళుతున్న ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కోకో రాష్ట్ర జట్టుకు ఎంపికైన గురుకుల విద్యార్థినులు

**నల్గొండ, సెప్టెంబర్ 21, మన సాక్షి:**



నల్గొండ పట్టణానికి చెందిన మహాత్మ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల విద్యార్థినులు కోకో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు .వీరు ఈ నెల ఎనిమిదవ తేదీన దామరచర్ల లో జరిగిన 34వ సబ్ జూనియర్ పోటీలలో పాల్గొని నల్గొండ టీం కు సెలక్షన్ కాగా వీరు నల్లగొండ టీం నుండి ఈ నెల 13, 14 ,15 తేదీలలో రంగారెడ్డి జిల్లా మల్లాపూర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కోకో టోర్నమెంట్ లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించినందున రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లైన ఎల్ వైష్ణవి, కే చందన ,లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. రాష్ట్ర జట్టు విద్యార్థులను ఆర్సిఓ సంధ్యారాణి,ఉమా,పిడి ఇందిరా, కోచ్ నాగేంద్రుడు అభినందించారు

# ఎస్సైని కలిసిన టిడిపి నాయకులు

**రామసముద్రం,సెప్టెంబర్ 21, మన సాక్షి:**



రామసముద్రం మండల నూతనంగా ఎస్సై బాధ్యతలు స్వీకరించిన ఎస్సై వెంకటసుబ్బయ్యను పెద్దిరెడ్డి , చలపతినాయుడు షాలువతో స్వాగతం పలికారు. అనంతరం టిడిపి నాయకులు పెద్దిరెడ్డి, చలపతి నాయుడు, కృష్ణప్ప, బాలాజీ, కమ్మవారిపల్లె సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ మండల కేంద్రంలోని అంబెడ్కర్ కూడలిలో కొంతమంది వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు ఆటోలు ఎక్కువసేపు అంబెడ్కర్ కూడలిలో నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారాలు చేపట్టాలని ఎస్సైను కోరారు. వెంటనే తగు చర్యలు తీసుకుంటానని ఎస్సై వారికి తెలిపారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమం కార్యాచరణ పట్ల హర్షం వ్యక్తం

**జగిత్యాల,సెప్టెంబర్21,(మన సాక్షి.)**



తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గల్ఫ్ దేశం దోహాఖతర్ లో కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎన్నారై ముహమ్మద్ నసీర్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమం మొదలుకొని పిల్లల విద్యాభ్యాసం వరకు విధానాలను ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గల్ఫ్ లో జీవనోపాధి పొందుతున్న వాళ్లు మరణిస్తే రూ.5 లక్షల ఎక్స్ గ్రేసియా ఇవ్వడం, ప్రజాభవన్ లో గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రవాసి ప్రజావాణి కౌంటర్ ఏర్పాటు చేయడం, ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాదాన్యం వంటి విప్లవాత్మక అంశాలు ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి సర్కార్ జీవో విడుదల చేసే విధంగా కృషి చేసిన గల్ఫ్ జేఏసీ బృందానికి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నారై సెల్ బృందానికి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముహమ్మద్ నసీర్, ఖాజా నవాజ్, కొన్నపల్లి శ్రావణ్, జనగం రమేష్, రాహీల్ ఖాన్, గోవింద్ మలవత్, బిబెక్ ఖడ్గా రాజేందర్ లు పాల్గొన్నారు.

# 28న జాతీయ లోక్ అదాలత్.

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్.**

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**



వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి...ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే అవి సమసిపోతాయని రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులలోని కక్షీదారులకు ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న నారాయణపేట, కోస్గి కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉన్న సందర్భంగా కక్షీదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజీ పడదగిన కేసుల్లో ఉన్న వారు చిన్నచిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఒకే గ్రామంలో ఉండేవారు ఎప్పుడు కలిసిమెలిసి ఉండాలని, యాక్సిడెంట్ కేసులు, కొట్లాట కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, కరోనా సమయంలోని కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు ఇతర రాజీ పడదగు కేసులలో ఈ నేషనల్ లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. కేసులలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోగలరని కోరారు. దీనికోసం ఫిర్యాదు దారుడు మరియు నేరస్తులు అందరూ తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్/ప్రదేశంలో హాజరుకావాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా వ్యాప్తంగా బాధితులకు ఇది ఒక మంచి అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి తీవ్రగాయం.

**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, సెప్టెంబర్ 21, మనసాక్షి :**



షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట్ మండలం వెలిజర్ల గ్రామం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థికి తీవ్ర గాయం అయిందని సమాచారం అందుకున్న విద్యార్థి ఇంటికి వెళ్లి బాధిత విద్యార్థిని సందర్శించి గాయానికి గల కారణాలను ఎంఈఓ మనోహర్ అడిగి తెలుసుకున్నారు. నిన్న వెలిజర్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి తీవ్రగాయం కాగా ఉపాధ్యాయులు పట్టించుకోలేదన్న వార్తపై ఎంఈఓ స్పందించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని విద్యార్థి తల్లి పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు గాయాలు జరగడం బాధాకరమన్నారు. పాఠశాలలో ఆడుకుంటున్న సమయంలో గాయమైందని ఉపాధ్యాయులకు గాయం ఎక్కడ జరిగిందో తెలిసి తెలియక చెప్పలేకపోయాడని విద్యార్థి ఐయూస్ టపా స్పష్టం చేశారు. ప్రస్తుతం విద్యార్థికి ఏ ప్రమాదం లేదని వైద్యం అందించిన డాక్టర్ తెలిపారు. అదేవిధంగా ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ మనోహర్ సూచించారు.

# సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి ఎమ్మెల్యే జారె

**దమ్మపేట సెప్టెంబర్ 21 మన సాక్షి**



అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించి ఈ సంవత్సరం చివరి నాటికి పనులు పూర్తి చేసి మండల ప్రజలకు సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి.



**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, సెప్టెంబర్ 21, మనసాక్షి :**

తెలంగాణ కోసం తన మంత్రి పదవిని సైతం తృణ ప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని షాద్ నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట జానార్దన్ కొనియాడారు. తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కోట జనార్ధన్ మాట్లాడుతూ.. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను పద్మశాలీలు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కోట జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు కో-ఆప్షన్ మెంబర్ వొగ్గు కిశోర్, ప్రధాన కార్యదర్శి చెన్న బాలరాజ్, కోశాధికారి బాస రాజేందర్, మాజీ అధ్యక్షులు పులిపాటి నర్సింలు, సంకూరి బుచ్చయ్య, వర్కల శ్రీనివాస్, మ్యాన బాలక్రిష్ణ, కోట పాండు రంగయ్య, పానుగంటి అంజయ్య, ఇప్పలపల్లి లక్ష్మీ, వొగ్గు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే దాగి ఉంది

## మాదకద్రవ్యాల పట్ల దూరంగా ఉండాలి

## నాంపల్లి సిఐ నవీన్ మార్

**చింతపల్లి,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాంపల్లి సిఐ నవీన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ లో స్థానిక జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గంజాయి మత్తు పదార్థం లాంటి మాదకద్రవ్యాల పై విద్యార్థులకు పిఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి చల్లం పాండు రంగారావు అధ్యక్షతన అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాంపల్లి సిఐ నవీన్ కుమార్ విద్యార్థులకు మనకు ద్రవ్యలపట్ల అవగాహన కల్పించారు. సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చెడు వ్యసనాల కు అలవాటు పడి మీ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. నేటి సమాజంలోని ప్రతి యొక్క విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ కుమారుడు, కుమార్తె గూర్చి ఎన్నో కలలు కంటారని, వారి కలలను మనం వమ్ము చేయకుండా ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో గుర్తింపు పొందినడే మనల కన్న తల్లిదండ్రులకు , చదువు నేర్పిన గురువులకు సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. నేటి భావి భారత పౌరులే ఈ ప్రపంచానికి దేశానికి, మార్గ నిర్దేశకులని విద్యార్థులకు సూచించారు. మీ భవిష్యత్తు కోసం మీరు తీసుకునే నిర్ణయాలే మీ బంగారు బాటకు పునాదులు వేస్తాయన్నారు. చెడు వ్యసన పట్ల దూరంగా ఉండి గుట్కా, గంజాయి, పాన్ పార్క్ , బీడీ, సిగరెట్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు అయినట్లయితే మీ భవిష్యత్తును మీరే పాడు చేసుకుంటానన్నారు. అనంతరం పి ఆర్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు చెల్లం పాండు రంగారావు ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఒక ప్రజా ప్రజా కళాకారు డిని అయినప్పటికీ నిరుపేద విద్యార్థుల కోసం తన వంతు సహాయ సహకారంగా పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులకు పరీక్షా సమయంలో ఎగ్జామ్ గైడెన్స్ మోడల్ పేపర్ను దాతల సహకారంతో తయారు చేయించి నల్లగొండ,ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్నగర్ తదితర జిల్లాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లను అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులే అన్ని రంగాలలో రాణిస్తున్నారు అన్నారు. శ్రద్ధగా విని ప్రణాళికతో ముందుకెళ్లలన్నారు. నవ సమాజ స్థాపన కోసం విద్యార్థులు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధ్యాపకులు సీఐ నవీన్ కుమారులును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చేల్లం పాండురంగారావు, గోడుకొండ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి జరుపుల పద్మ నాయక్,ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం హెూలే సుధీర్ బాబు. ఎండి .అన్వర్, నరసింహ, గోపాల్, ప్రవీణ్ శర్మ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణి

**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు సెప్టెంబర్ 21 మనసాక్షి:**




రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా అభయ హస్తంలో మహాలక్ష్మి పథకం కింద దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారికి భారం పడకుండా కాలుష్య రహిత వంటగ్యాస్ రూ.500 లకు గ్యాస్ సిలిండర్ ని అందజేస్తుంది. ఈ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు రేషన్ డీలర్లకు ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శనివారం ఆమనగల్లు మండల పరిధిలోని శంకర్ కొండ తాండలో రేషన్ డీలర్ కృష్ణ గ్రామ కార్యదర్శి విజయ కసిరెడ్డి నారాయణరెడ్డి యూవసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ది దారులకు సబ్సిడీ మంజూరైనా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళా సాధికారిక బీపీఎల్ కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించడం కోసం వారికి కాలుష్య రహిత వంట వండు కోవడానికి ఈ పథకంలో ఎంపికైన కుటుంబాలకు వినియోగధారంగా ఎల్పిజి సిలిండర్ లో పరిమితం చేయబడతాయని లబ్ది దారులు సిలిండర్ అందిన తర్వాత సబ్సిడీ నగదు మీ బ్యాంకు ఖాతాలో నాలుగు రోజుల్లో జమ అవుతుందన్నారు. ఒకవేళ జమకాని లబ్ది దారులు ఉన్నట్లయితే ప్రొసీడింగ్ పత్రాలలో ఉన్న ఫోన్ నెంబర్ కి ఫోన్ చేసి మన ఖాతాకు సబ్సిడీ రుణాన్ని జమ చేసుకో వచ్చునన్నారు. ఈ సబ్సిడీ మంజూరైనా సందర్భంగా గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలుతెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు లక్ష్మణ్,చంద్రు, హనుమంతు,లు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆర్పీల నిరసన

**సూర్యాపేట,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



పట్టణ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు వెన్న కవిత, ప్రియదర్శని సంఘ సభ్యురాలు భాగ్యమ్మలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రిసోర్స్ పర్సన్ జిల్లా అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శనివారం రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీసుకున్న పొదుపు సంఘం డబ్బుల నిమిత్తం రికవరికి వెళ్తే పదేళ్లుగా లెక్కలు చూపించకుండా లేనిపోని నిందలు మోపి తమను తొలగించాలని జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్కసారి మారాల్సి ఉండగా ఒక్కరే పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని వాపోయారు. అరకోర వేతనాలతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందని అలాంటి మాపై నిందలు మోపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని తక్షణమే ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో తమ సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమళ్ల అన్నపూర్ణకు దరఖాస్తు అందజేశామని గుర్తు చేశారు. వారిపై చర్యలు తీసుకొని పక్షంలో సోమవారం కలెక్టరేట్ నుముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్పీలు కోతి పద్మ, కోల మంగ, బీబీ, మంత్రాల పద్మ, గోన విజయమ్మ, కప్పల పద్మ, నూర్జహాన్, రెహనా, లక్ష్మీ ప్రియ, రజినీ, నాగమణి, రాణి, నాగమణి, కట్ట రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి మహెూన్నతమైనది

**శాలిగౌరారం,సెప్టెంబర్ 21,మన సాక్షి:**



**విద్యార్థులలో నైపుణ్యంను గుర్తిచాలి**

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

రేపటి భావి భారత పౌరులైన విద్యార్థులకు విద్యతో పాటు వారి నైపుణ్యాలని గుర్తించే భాద్యత నవ సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులేనని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలో పనిచేస్తూ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా 18 మంది ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేసిన సన్మాన కార్యక్రమానికి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహెూన్నతమైనదని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతం కోసం అన్ని చర్యలు చేపడుతుందని అన్నారు. సామాజిక రుక్మధులను రూపుమాపేందుకు కృషి చేయాలని కోరారు. గత పది సంవత్సరాల నుండి నిర్వీర్యం అయిన ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసే దిశగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుంది అని అన్నారు. ఉపాధ్యాయులు అంటే కేవలం గురువులే కాదు విద్యార్థుల భవిష్యత్ ను తీర్చి దిద్దే దర్శకులు గుర్తుచేశారు. విద్యార్థులకు సబ్జెక్ట్ ల తో పాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యాల ను గుర్తించి సన్మార్గం లో పయనించే దిశగా ప్రోత్సహించాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఇఓ మేక నాగయ్య,నోడల్ ఆఫీసర్ మామిడి సైదులు,వివిధ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు పున్న శ్రీనివాస్, రాకేష్ కుమార్, బందెల సైదులు, వెంకటరమణ,నాయకులు ఎర్ర యాదగిరి, దండ అశోక్ రెడ్డి,చింత ధనుంజయ్,వడ్లకొండ పరమేష్ గౌడ్, లోకసాని రంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

**ముదిగొండ సెప్టెంబర్ 21: మనసాక్షి**

మండల పరిధిలోని చిరుమర్రి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో మండల స్థాయిలో భాగంగా పోషణ మాస కార్యక్రమం జరపడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ సి డి పి ఓ మాట్లాడుతూ పలు సూచనలు తెలిపారు, గర్భిణీలు తీసుకోవాల్సిన ఆహారం టిటి డోసేస్, రక్తహీనత లేకుండా, పౌష్టికాహారం తీసుకోవడం, పిల్లలకు వయసుకు తగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అన్నప్రసన్న శ్రీమంతులు కార్యక్రమాలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో, ఏసీ డిపిఓ, పీహెచ్ డాక్టర్లు, అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు మొదలగురు పాల్గొనడం జరిగింది..

# ఆర్టీసీ బస్ డ్రైవర్ పై విచక్షణరహితంగా దాడి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 21 మనసాక్షి**

అఫ్జల్ గంజ్ నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్తున్న రూట్ నంబర్ 3%ఖ%/281 మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులో విధులు నిర్వర్తిస్తోన్న డ్రైవర్ గణేష్‌పై దుండగులు విచక్షణరహితంగా దాడి చేశారు. దాడికి గురైన డ్రైవర్‌ను పరామర్శించిన ఎండీ వీసీ సజ్జనర్. తమ సిబ్బందిపై దాడులకు పాల్పడితే తీవ్రమైన కఠిన చర్యలుంటా

**యని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు.**

**నిందితులపై**

పోలీస్ శాఖ సహకారంతో రౌడీ షీట్స్ తెరుస్తామని ఆయన స్పష్టం చేశారు. దుండగుల చేతిలో దాడికి గురై తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుషాయిగూడ డిపో డ్రైవర్ దారవత్ గణేష్‌ను వీసీ సజ్జనర్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితితో పాటు దాడి జరిగిన తీరును ఆయనను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ డ్రైవర్ కు టీజీఎస్‌ఆర్టీసీ పూర్తిగా అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అఫ్జల్ గంజ్ నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్తున్న రూట్ నంబర్ 3%ఖ%/281 మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులో విధులు నిర్వర్తిస్తోన్న డ్రైవర్ గణేష్‌పై ఉస్మానియా యూనివర్శిటీ వై జంక్షన్ వద్ద శుక్రవారం దుండగులు విచక్షణరహితంగా దాడి చేశారు. ఎలాంటి తప్పు లేకున్నా బస్సును రోడ్డుపై ఆపి సీటులో కూర్చున్న డ్రైవర్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ ఆరుగురు తీవ్రంగా కొట్టారు. డ్రైవర్ గణేష్ కు తీవ్ర గాయలవడంతో అపస్మారక స్థితలోకి వెళ్లిపోయారు. వెంటనే ఆయనను తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తమ డ్రైవర్‌ది ఎలాంటి తప్పులేదని, బైక్‌లపై వచ్చి ఉద్దేశపూర్వకంగా దుండగులు దాడికి పాల్పడ్డారని వీసీ సజ్జనర్ అన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగానే..



హైదరాబాద్ కమిషనరేట్ ఉస్మానియా యూనివర్శిటీ పోలీసులు వెంటనే స్పందించారని చెప్పారు. దుండగులపై బీఎన్ఎస్‌లోని 109, 132, 352, 351(2), %తీ/ష% 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. ఐదుగురు దుండగులను శనివారం అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రజల మధ్య విధులు నిర్వర్తించే టీజీఎస్ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమన్నారు. తమ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే, మనోవేదనకు గురిచేసే ఇలాంటి దాడులను యాజమాన్యం ఏమాత్రం సహించబోదని, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. డ్రైవర్‌ను పరామర్శించిన వారిలో జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి ఓఎస్డీ సైది రెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎం ఖుష్రోషా ఖాన్,
డిప్యూటీ ఆర్. ఎం భీంరెడ్డి,డిపో మేనేజర్ మహేష్ కుమార్ కుషాయిగూడ డిపో తదితరులు ఉన్నారు.

# తిరుమల శ్రీవారి లడ్డు వివాదంపై సిబిఐ విచారణ జరిపించాలి

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 21: (మన సాక్షి)**



తిరుమల శ్రీవారి పుణ్యక్షేత్రంలో లడ్డు వివాదం పై సిబిఐ విచారణ జరిపించాలని శంకర్‌పల్లి మండల బిజెపి జనరల్ సెక్రెటరీ రాజేంద్ర సింగ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల పుణ్యక్షేత్రంలో లడ్డు నాణ్యత అందులో జంతువుల కొవ్వు వాడినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో నిజాలు బయటికి రావాలంటే సమగ్ర విచారణ అవసరమన్నారు. ఇలాంటి ఘటనలు జరగడానికి ముఖ్య కారణం అన్యమతస్తులను ఉద్యోగులుగా నియమించడమేనని తెలిపారు. ఈ చర్యలను మొదటి నుండి బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అయినా ఆయా ప్రభుత్వాలు చలనం లేకుండా వ్యవహరించాయన్నారు. ఈ యొక్క కల్తి నెయ్యిని వాడడం అనేది తిరుమల పవిత్రతను దెబ్బతీయటమేనని అన్నారు. అంతేకాకుండా యావత్ ఈ దేశంలోని హిందువుల మనోభావాలను కించపరచడమేనని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల బిజెపి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# బంగారు పథకం సాధించిన విద్యార్థినికి సన్మానం.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**



నారాయణపేట జిల్లా కేంద్రం లోని పళ్ల ప్రాంతానికి చెందిన విద్యార్థినీ యం. అమూల్య స్థానిక కృష్ణవేణి హై స్కూల్ లో 4వ తరగతి చదువుతునే మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 17న జడ్చర్లలో నిర్వహించిన జాతీయ స్థాయి వి.ఐ.పి చాలెంజర్స్ చాంపియన్షిప్ కుంగ్ ఫు కరాటే పోటీలో బంగారు పథకం సాధించినందుకు శనివారం కృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపాల్ ఇమ్రాన్ ఖాన్ శాలువాతో సన్మానించి విద్యార్థినిని అభినందించారు. బంగారు పథకంతో పాటు సర్టిఫికెట్ అందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తేవాలని అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ కేశవ్ అకాడమీ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ అశోక్. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క సహకారంతో జిల్లా అభివృద్ధి సాధ్యం.

**మంగపేట సెప్టెంబర్ 21, మన సాక్షి**

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సహకారంతోనే ములుగు జిల్లా అభివృద్ధి సాధ్యమని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ. ఏటూరునాగారంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తూ ముప్పై ఐదు మంది అగ్నిమాపక సిబ్బందిని మంజూరు చేయడం, ములుగు జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి నాలుగు వందల ముప్పై మూడుమంది సిబ్బందిని మంజూరు చేస్తూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల సాంబశివరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఏటూరునాగారం లో అగ్ని మాపక కేంద్రం ఎన్నో దశాబ్దాల కల అని అది నేడు మంత్రి సీతక్క సహకారంతో ఆచరణలో సాధ్యమైందని వెనుకబడిన ములుగు జిల్లాకి మెడికల్ కళాశాల ఏర్పాటు పూర్తి స్థాయిలో సిబ్బంది మంజూరు చేసి జిల్లా అభివృద్ధిపై మంత్రి సీతక్క తనదైన చెరగని ముద్ర వేశారని సాంబశివరెడ్డి సీతక్క సేవలను కొనియాడారు. ములుగు జిల్లా అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు



బట్టి విక్రమార్క, జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మరియు అధికారులకు ప్రభుత్వానికి ములుగు జిల్లా ప్రజల తరఫున మరియు కాంగ్రెస్ పార్టీ తరఫున సాంబశివరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు, మంత్రి సీతక్క చొరవతో త్వరలోనే ఏటూరునాగారం కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల సెంటర్, బస్ డిపో, మంగపేట మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం పనులు ప్రారంభం అవుతాయని. సాంబశివరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన.



**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి**

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకుశనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయని కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండాలని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్ కి బానిసలై తమ లక్ష్యాలను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దు అన్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచి తమ నైపుణ్యానాలను పెంపొందించుకొని ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు గేమ్స్ ఆడాలని ఏదో ఒక గేమ్ పై మక్కువ చూపాలని ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే షీటీం సెల్ నంబర్ 8712670398 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ఎస్సీ మోర్చా నిరసన.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 21 మనసాక్షి :-**



అమెరికాలో దేశ విద్రోహ శక్తులతో కలిసి ప్రెస్ మీట్ లో భారతదేశం మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనకాల అంతరార్థం ఏందో చెప్పాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్ కుమార్,జిల్లా ఇంఛార్జి ఎడ్ల కృష్ణన్న,బిజెపి జిల్లా అధ్య క్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు.ప్రపంచ వేదికల పైన రాహుల్ గాంధీ భారత్ ను తక్కువగా చేసి మాట్లాడుతు తప్పుడు ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైనా తొత్తుగా వ్యవహరిస్తున్న రాహుల్ గాంధీ వెంటనే భారతదేశ ప్రజానీకానికి, నరేంద్ర మోడీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
భారతీయ జనతా పార్టీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అంటున్న రాహుల్ కు అసలు మెదడు ఉందా అని ప్రశ్నించారు.భారతీయ జనతా పార్టీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కట్టుబడి ఉందని, అంత్యోదయ సిద్ధాంతాన్ని కట్టుబడి పని చేసే పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 'సంక్షేమ మంత్రిత్వ శాఖ' పేరును 'సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ'గా మార్చారనీ అన్నారు.ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలు ఇప్పటికీ చారిత్రక ప్రతికూలతలతో బాధపడుతున్న సమాజంలో సంక్షేమం మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా సీనియర్ నాయకుడు టి.ఆశప్ప,జిల్లా కార్యదర్శి గోపాల్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్,కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య,మండల నాయకులు వై.నారాయణరెడ్డి, ఎస్.లక్ష్మన్,భీంరాజ్,గజేంద్ర,సూరి,రాజు,సురేష్,లింగరాజు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**నాచారం,సెప్టెంబర్21,మన సాక్షి**



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ బాలకృష్ణ నేత ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పులలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వాది, బడుగు, బలహీనవర్గాలకు స్ఫూర్తి ప్రదాత లక్ష్మణ్ బాపూజీ అన్నారు. మూడు తరాలుగా చేసిన ఉద్యమం ప్రస్థానాన్ని కొనియాడారు. ఆయన వేసిన ఉద్యమ బాటలో ముమ్ముందు తరాలు పయనించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విజేయస్ అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్, టిడిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్, బోనాల నగేష్, శేఖర్, రాపోలు వాసు, వర్కాల రవి, శ్రీనివాస్, క్రాంతి, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుందరాంగుడికి అపురూపాలంకరణ

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 21 మనసాక్షి**



అందానికి అందం. ఆనంద నిలయుడి సుందర రూపం. ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ఆలయంలోని ఆనంద నిలయుడికి అపురూపాలంకరణ. నేటి శనివారం సందర్భంగా పలురకాల పుష్పాల మాలలతో శ్రీవారిని అపురూపంగా అలంకరించిన ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు.
ఈ సందర్భంగా ఆలయ ఈవో ఏవి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం నుండే ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అందం అనగానే ముందుగా గుర్తుకొచ్చేది పువ్వులు అలాంటి పువ్వులు స్వామివారి చెంతకు చేరి అందానికి వన్నె తెచ్చాయని, స్వామివారి పుష్పాల మాలల తోరణాల అలంకరణలో అపురూపంగా దర్శనమిచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తులసి వెంకట రమణ చార్యులు, కొండపాక వేణు గోపాల చార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్, శ్రీవారి సేవ భక్తబృందం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పోషక అనర్థాలపై అవగాహన కల్పించాలి.

**నెలకొండపల్లి, సెప్టెంబర్ 21 మన సాక్షి:**

పోషక లోపాల వల్ల జరిగే అనర్థాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాలని, సూపర్వైజర్ పార్వతి పేర్కొన్నారు. పోషణ మహోత్సవాలలో భాగంగా మండలంలోని మంగాపురం తండా అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమంలో నిర్వహించారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... పిల్లల ఎదుగుదల కోసంకేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పడుతున్నట్లు పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషక లోపం వల్ల కలిగే అనర్థాలను గర్భిణీలు, బాలింతలకు అవగాహన కలిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యాయుడు వెంగళరావు, పలువురు అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెవిన్యూ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన

**అడిషనల్ కలెక్టర్ డి మధు సూధన్ నాయక్**

**ముదిగొండ (మన సాక్షి )సెప్టెంబర్ 21:**



మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ డి మధు సూధన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు తహశీల్దార్ సునిత తో మాట్లాడుతూ ధరణి స్లాట్లు ,మీసేవ సర్టిఫికెట్లు పెండింగ్ లో ఉండకుండా చూడాలని ఓటర్ ఐడిలు మార్పులు చేర్పులు కొత్త నమోదులు 25వ తారీఖు లోపు త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు..

# మద్యం సేవించి వాహనం నడిపిన వారికి నాలుగు రోజుల జైలు శిక్ష

**జగిత్యాల, సెప్టెంబర్21,(మన సాక్షి,)**

మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ గంప కరుణాకర్ తీర్పు నిచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రామచంద్రం తెలిపిన వివరాల ప్రకారం పుడూరు గ్రామానికి చెందిన వడ్లకొండ నాగభూషణం, మేట్ పల్లి పట్టణానికి గుండేటి మధుసూదన్ అనే ఇద్దరు వ్యక్తులు అతిగా మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడపడంతో కేసు నమోదుచేసి సంబంధిత కోర్టు లో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడపటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు మీ అజాగ్రత్త చర్య వలన మీరే కాకుండా అవతలివారి ప్రాణాలు పోవటానికి కూడా భాద్యులు అవుతున్నారు. కావున మద్యం సేవించి వాహనాలు నడపకండి. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై సూచించారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.